# పంచగ్రంథము

మొదటి పాఠం

## పంచగ్రంథము యొక్క పరిచయం

Manuscript

thirdmill

Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# విషయ సూచిక


ఉపోద్ఘాతం .......... 1

ఆధునిక విమర్శనాత్మక విధానములు .......... 1

**పూర్వభావిత్వములు .......... 2**

ప్రాకృతికవాదము.......... 3

చారిత్రిక పురోగమనము .......... 3

**గ్రంథకర్తృత్వము .......... 6**

దేవుని పేర్లు .......... 6

నకిలీ కథనములు .......... 7

అసమానతలు .......... 8

**వ్యాఖ్యాన వ్యూహములు .......... 9**

మూల విమర్శ.......... 9

రూప విమర్శ .......... 11

పారంపరిక విమర్శ.......... 12

సంపాదకీయ విమర్శ .......... 12

సమకాలపు విమర్శ.......... 13

ఆధునిక ఇవాంజెలికల్ విధానములు .......... 13

**పూర్వభావిత్వములు .......... 14**

లోకాతీతవాదము .......... 14

చారిత్రిక పురోగమనము .......... 15

**గ్రంథకర్తృత్వము .......... 16**

బైబిలు ఆధారము.......... 16

ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వము.......... 18

**మూలములు. .......... 19**

**ప్రక్రియ. .......... 22**

**సవరణ. .......... 22**

**వ్యాఖ్యాన వ్యూహములు .......... 25**

అంశాత్మక.......... 25

చారిత్రిక .......... 26

సాహిత్య.......... 27

ముగింపు .......... 29





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# పంచగ్రంథము

మొదటి పాఠం

పంచగ్రంథము యొక్క పరిచయం

## ఉపోద్ఘాతం

బైబిలు లేకపోతే క్రైస్తవ విశ్వాసము ఎంత భిన్నముగా ఉండేదో ఎప్పుడైనా ఊహించారా? నాయకులు ఒక తరము నుండి మరొక తరమునకు హెచ్చరికలను పంచియుండేవారు, కాని వారి ఆలోచనలను విశ్లేషించుటకు, పలు అభిప్రాయముల మధ్య ఎంపిక చేసుకొనుటకు ఎలాంటి అవకాశం ఉండియుండేదికాదు.

మోషే కాలములోని ఇశ్రాయేలులోని అనేకమందికి ఈ విధంగానే జరిగియుంటుంది. ప్రాచీన చరిత్ర మరియు తమ పితరులను గూర్చిన వృత్తాంతములను వారి పితరులు వారికి అందించారు. దేవుడు ఇశ్రాయేలును ఐగుప్తు నుండి విడిపించిన విధానమును, తన ధర్మశాస్త్రమును ఇచ్చిన విధానమును, మరియు వారిని వాగ్దాన దేశము వైపుకు నడిపిన విధానమును గూర్చి వారు వృత్తాంతములుగా తెలియజేసేవారు. అయితే అప్పటి పరిస్థితులలో, మరియు భవిష్యత్తులో దేవుడు ఇశ్రాయేలుతో ఏమి చేయబోతున్నాడు అని వారు నమ్మివలసియుండెను? ఈ విషయముల మీద పలు అభిప్రాయముల మధ్య వారు ఎంపిక ఎలా చేసుకోవాలి. వారి విశ్వాసమునకు ప్రమాణముగా బైబిలులోని మొదటి ఐదు పుస్తకములను ఇచ్చుట ద్వారా దేవుడు ఇలాంటి ప్రశ్నలకు జవాబిచ్చాడు, వీటిని మనము నేడు పంచగ్రంథము అని పిలుస్తాము.

*పంచగ్రంథము* అను మన పాఠ్యక్రమములో ఇది మొదటి పాఠము, మరియు దీనికి “పంచగ్రంథము యొక్క పరిచయం” అను శీర్షికనిచ్చాము. ఈ పాఠములో ఇశ్రాయేలు యొక్క విశ్వాసమునకు ప్రమాణముగా పనిచేయు ఆదికాండము నుండి ద్వితీయోపదేశకాండము వరకు ఉన్న బైబిలు పుస్తకములను పరిచయం చేద్దాము.

పంచగ్రంథమునకు మనము ఇచ్చే పరిచయం రెండు ప్రధానమైన భాగములుగా విభజించబడుతుంది. మొదటిగా, బైబిలులోని ఈ భాగమునకు ఆధునిక విమర్శనాత్మక విధానములను వర్ణించుదాము. ఈ విధానములు లేఖనము యొక్క సంపూర్ణ అధికారమును తిరస్కరించు వ్యాఖ్యానకర్తల యొక్క అభిప్రాయములను తెలియజేస్తాయి. రెండవదిగా, ఆధునిక ఇవాంజెలికల్ దృక్పధములను చూద్దాము, ఇవి దేవుని ద్వారా ప్రేరేపించబడిన వాక్యముగా బైబిలు యొక్క సంపూర్ణ అధికారమును ఉద్ఘాటించు బైబిలు పండితుల యొక్క అభిప్రాయములను వ్యక్తపరుస్తాయి. మొదటిగా పంచగ్రంథమునకు ఆధునిక విమర్శనాత్మక విధానములను చూద్దాము.

## ఆధునిక విమర్శనాత్మక విధానములు

మన పాఠములు పలు దిశలలో వెళ్లబోవుచున్నప్పటికీ, చాలామంది ఆధునిక బైబిలు పండితులు పంచగ్రంథము యొక్క దైవిక ప్రేరణను మరియు అధికారమును తిరస్కరించారు అను విషయమును



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

గుర్తించుట చాలా ప్రాముఖ్యమైయున్నది. ఇశ్రాయేలుకు ధర్మశాస్త్రమునిచ్చిన మోషే దినములలో పంచగ్రంథము వ్రాయబడినదను సాంప్రదాయిక యూదుల మరియు క్రైస్తవుల అభిప్రాయమును కూడా వారు తిరస్కరించారు. అనేకమంది వ్యాఖ్యానకర్తలు, బోధకులు, కాపరులు మరియు సామన్య ప్రజలు కూడా ఈ అభిప్రాయములను ఆమోదిస్తారు కాబట్టి లేఖనములను శ్రద్ధగా చదువు విద్యార్థులకు ఇట్టివారిని నివారించడం ఇంచుమించు అసాధ్యం అవుతుంది. ఈ కారణం చేత, బైబిలులోని ఈ భాగముతో విమర్శనాత్మక పండితులు వ్యవహరించిన విధానమును అర్థము చేసుకొనుట చాలా ప్రాముఖ్యమవుతుంది.

> గత 150 నుండి 200 సంవత్సరాలలో, విమర్శనాత్మక పండితులు పంచగ్రంథము యొక్క అధ్యయనం మీద విశేషమైన దృష్టిని పెట్టారు. ఇవాంజెలికల్ క్రైస్తవులమైన మనలో చాలామంది ఈ విధానములకు సమ్మతి తెలుపనప్పటికీ, వారు ఇచ్చే సలహాలకు సరిగా స్పందించుటకుగాను అనేకమంది పాత నిబంధన పండితుల యొక్క అభిప్రాయములను తెలుసుకొనుట మనకు సహాయకరముగా ఉంటుంది. మన చుట్టు జరుగుతున్న పరిస్థితులను గూర్చిన అవగాహన లేకుండా మనము బైబిలు అధ్యయనమును శూన్యములో చేయలేము. ఇతరులు చెప్పిన విషయముల వెలుగులో మనము మన విధానములను తెలియజేయాలి.
>
> — డా. జాన్ ఒస్వల్ట్

పంచగ్రంథమునకు ఆధునిక విమర్శనాత్మక విధానములను అర్థము చేసుకొనుటకు, మనము మూడు విషయములను చూద్దాము: మొదటిగా, విమర్శనాత్మక దృక్పథములను ప్రభావితము చేసిన కొన్ని ముఖ్యమైన పూర్వభావిత్వములు; రెండవదిగా, పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వమును గూర్చి కొన్ని విమర్శనాత్మక దృక్కోణములు; మరియు మూడవదిగా, విమర్శనాత్మక పండితులు అనుసరించిన అనేక ప్రాముఖ్యమైన వ్యాఖ్యాన వ్యూహములు. ముందుగా ఈ విధానముల మీద ప్రభావం చూపిన కొన్ని పూర్వభావిత్వములను చూద్దాము.

## పూర్వభావిత్వములు

చాలా వరకు, బైబిలులోని ఈ భాగము మీద ఆధునిక విమర్శనాత్మక అభిప్రాయములన్నీ పదిహేడు మరియు పద్దెనిమిదవ శతాబ్దములలో పశ్చిమ ఐరోపాలో ఆరంభమైన జ్ఞానోదయము యొక్క జ్ఞాన అభిప్రాయములలో నుండి సూటిగా వెలువడినాయి.

మన ఉద్దేశ్యముల కొరకు, జ్ఞానోదయములో నుండి వెలువడిన రెండు ప్రాముఖ్యమైన పూర్వభావిత్వముల మీద మనము దృష్టిపెడదాము. ఈ రెండు దృక్కోణములు పంచగ్రంథము యొక్క విమర్శనాత్మక వ్యాఖ్యానముల మీద విశేషమైన ప్రభావమును చూపాయి. మొదటిగా, మనము ప్రాకృతికవాదము అను ఆలోచనను చూద్దాము. మరియు రెండవదిగా, ఇశ్రాయేలు విశ్వాసము యొక్క చారిత్రిక పురోగమనమును గూర్చి కొన్ని పూర్వభావిత్వములను చూద్దాము. ప్రాకృతికవాదముతో ఆరంభిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ప్రాకృతికవాదము

క్లుప్తంగా, ఒకవేళ ఆత్మీయ వాస్తవికతలు ఉనికిలో ఉన్నాగాని, అవి దృశ్య లోకము మీద ఎలాంటి విశేషమైన ప్రభావమును చూపవు అను పాండిత్యవాదము జ్ఞానోదయ ప్రాకృతికవాదములో కనిపిస్తుంది. ఈ కారణం చేత, ఆత్మీయ వాస్తవికతలకు విద్యా పరిశోధనలో ఎలాంటి స్థానము లేదు. పంతొమ్మిదవ శతాబ్దము యొక్క మధ్య భాగానికి, ప్రాకృతికవాదము పాశ్చాత్యములో క్రైస్తవ విశ్వాస అధ్యయనములతో సహా ప్రతి విద్యా క్షేత్రము మీద ప్రభావము చూపింది. బైబిలు అధ్యయనముల మీద ప్రాకృతికవాదము చూపిన ఒక ప్రధానమైన ప్రభావము ఏమనగా, పంచగ్రంథము దేవుని ద్వారా ప్రేరేపించబడినది అని యూదులు మరియు క్రైస్తవులు చాలా కాలముగా కలిగియుండిన నమ్మకమును ప్రఖ్యాతిగాంచిన పండితులు తిరస్కరించారు. ఈ కారణం చేత, అనేకమంది పురాతన సంస్కృతులలో వ్రాయబడిన మత సంబంధమైన రచనలను అధ్యయనం చేసిన విధంగానే సాధారణముగా పంచగ్రంథమును అధ్యయనం చేయుట ఆరంభించారు. ఈ అభిప్రాయము ప్రకారం, ఇతర మానవ రచనల వలెనే పంచగ్రంథములో కూడా అన్ని విధములైన తప్పిదములు, వైరుధ్యములు, చరిత్రను గూర్చి ఉద్దేశపూర్వకమైన తప్పుడు వ్యాఖ్యలు మరియు అబద్ధ వేదాంతశాస్త్రము ఉన్నాయి.

ఆసక్తికరముగా, ప్రాకృతికవాదమునకు దారితీసిన పూర్వభావిత్వములు పంచగ్రంథములోని ప్రేరణ మరియు అధికారమును తిరస్కరించునట్లు ఆధునిక పండితులను పురికొల్పుటతో పాటుగా, ఇశ్రాయేలు విశ్వాసము యొక్క చారిత్రిక అభివృద్ధి మీద కొన్ని నూతన దృక్పథములకు కారణమయ్యాయి.

## చారిత్రిక పురోగమనము

పంతొమ్మిదవ శతాబ్దము ఆరంభము నాటికి, ప్రాకృతికవాదము "ప్రాకృతికవాద చరిత్రాధ్యయనం" అనుదానికి దారితీసింది. ఒక విషయమును గూర్చి అర్థము చేసుకొనుటకు ఆ విషయము చరిత్రయంతటిలో ప్రాకృతిక కారణాల ద్వారా ఏ విధంగా అభివృద్ధి చెందిందో అర్థము చేసుకొనుట ఉత్తమమైన మార్గమను  నమ్మిక ఇది. భూమి మీద జీవనము అనేక శతాబ్దములుగా ఏ విధంగా ఆరంభమయ్యిందో మరియు పరిణమితిని పొందిందో వివరించుట మీద పంతొమ్మిదవ శతాబ్దపు జీవశాస్త్రజ్ఞులు దృష్టినిపెట్టారు. భాషావేత్తలు మానవ భాషల యొక్క చారిత్రిక పురోగమనములను కనుగొనుటకు ప్రయత్నించారు. పురావస్తుశాస్త్రజ్ఞులు మానవ సమాజముల యొక్క పురాతన నేపథ్యములను మరియు వాటి యొక్క ప్రగతిని పునర్నిర్మించారు. మతములకు సంబంధించిన క్షేత్రములోని పండితులు ప్రపంచ మతముల యొక్క ప్రాకృతిక మరియు చారిత్రిక పురోగమనమును గూర్చి వర్ణించుట మీద ఇదే విధమైన దృష్టిపెట్టారు.

మొత్తానికి, ఆరంభ ఆధునిక పాశ్చాత్య పండితులు మానవ సమాజములో జరిగిన పురోగమనములను గూర్చి వారు కలిగియుండిన అవగాహనకు అనుగుణంగా ప్రపంచ మతముల యొక్క పురోగతిని పునర్నిర్మించారు. ఉదాహరణకు, పురాతన ప్రజలు ప్రాచీన గిరిజన సమాజములను మొదటిగా స్థాపించి ఆత్మల ఆరాధనను, అనగా ప్రకృతిలోని వస్తువులకు ఆత్మలతో అనుబంధము ఉంది అను నమ్మకమును, ఆచరించారనే ఒక సామాన్య ఆలోచన ఉంది. కాలక్రమేనా, ప్రాచీన గిరిజన సమాజములు పెద్ద ముఖ్యపాలితములను నిర్మించాయి మరియు వారు బహుదేవతారాధనను అనుసరించారు. మరియు అనేక దేవుళ్లను నమ్మారు. అనేక ముఖ్యపాలితములు కలిసి పెద్ద



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సమాఖ్యాలను స్థాపించినప్పుడు, మతము బహుదేవతారాధన నుండి దేవుళ్ళందరిలో ఒక దేవుడు గొప్పవాడు అను నమ్మకమును ప్రతిపాదించు ఒకే దైవ ఔన్నత్య వాదము వైపుకు మళ్లింది. చివరిగా, పెద్ద రాజ్యములు మరియు సామ్రాజ్యముల యొక్క ఆవిర్భావముతో, బలమైన చక్రవర్తులు మరియు యాజకులు తమ దేశములను ఒకేదైవ ఔన్నత్య వాదము నుండి ఏకేశ్వరవాదములోనికి, అనగా ఒకే దేవుని నమ్ముటలోనికి నడిపించారు. మరియు ఈ ప్రాకృతికవాద చరిత్రాధ్యయన అభిప్రాయములో, ఈ ఉన్నతమైన పురోగమనము పొందిన స్థాయి వరకు మతము యొక్క ఆచారములు నిర్ణయించబడలేదు, లేక వ్రాయబడలేదు. ఈ కాలమునకు మునుపు, మతము ఒక తరములో నుండి మరొక తరమునకు మౌఖిక మరియు ఆచార సంప్రదాయముల ద్వారా మాత్రమే అందించబడింది.

ఇప్పుడు, ఇవరైయ్యవ శతాబ్దములో తరువాత మతములు అంత సులువైన విధానములో పురోగతిని పొందాయను ఆలోచనను మానవశాస్త్రజ్ఞులు తిరస్కరించారు అను విషయమును మనము గుర్తించాలి. అయితే ఆధునిక యుగము యొక్క ఆరంభములో బైబిలు పండితులు పంచగ్రంథముతో వ్యవహరించిన విధానము మీద ఈ దృక్పధములు లోతైన ప్రభావమును చూపాయి. మరియు నేడు కూడా అవి బైబిలు పాండిత్యము మీద ప్రభావమును చూపుతున్నాయి.

> ప్రాచీన, సులువైన మత రూపములో నుండి మరింత క్లిష్టమైన కఠినమైన రూపములోనికి నమ్మకములు పురోగమనము చెందిన విధానమును పాత నిబంధన ప్రతిబింబిస్తుంది అని, తరువాత రూపము మునుపటి రూపము కంటే ఉత్తమమైనదని “విమర్శనాత్మక పాండిత్యము” ఊహిస్తుంది. దీనిని గూర్చి మనము ఒకటిరెండు విషయములను చెప్పవచ్చు. మొదటిగా, భావర్థకముగా, దేవుడు తనను తాను ప్రజలకు బయలుపరచుకున్న విధానములో పురోగతి జరిగింది అని మనము చెప్పవచ్చు. బైబిలు దీనిని చూపుతుంది, దీనిని మనము “కర్బన సంబంధమైన ఎదుగుదల” అని పిలుస్తాము, దీనిలో దేవుని గూర్చిన సిద్ధాంతములు మరియు అంశములు మరియు ఆలోచనలు విత్తన రూపములో నుండి సంపూర్ణతలోనికి ఎదుగుతాయి, కాబట్టి బైబిలు కూడా దానిలోని పురోగతి చెందిన సందేశమును గూర్చి మాట్లాడుతుంది. కాబట్టి, అవును, బైబిలులోను పంచగ్రంథములోను ఒక పురోగతి ఉన్నది. మీరు పుష్పములు వికసించు దృష్టాంతములో దీనిని గూర్చి ఆలోచన చేసినట్లయితే, ఇది దేవుని ప్రత్యక్షత యొక్క ఆరంభముల నుండి సంపూర్ణముగా పుష్పించు వరకు జరుగు ఉద్యమముగా ఉన్నది. కాని, ప్రతికూలముగా, విమర్శనాత్మక పండితులు మానవ చరిత్రను గూర్చి పురోగతి చెందు లేక పురోగమన అభిప్రాయమును కలిగియుంటారు మరియు ఇది పురోగతి అనివార్యమైనదిగా ఉన్నదని తలంచుతుంది... ఇప్పుడు, పురోగతి యొక్క అనివార్యత ఒక గొప్ప కల్పితమని మన చుట్టూ ఉన్న లోకమును చూస్తే మనకు అర్థమైపోతుంది. అవును, మనము ప్రగతిని సాధిస్తాము, కాని ప్రగతిని సాధించుటతో పాటుగా మనము మార్పు కూడా చెందుతాము. కాబట్టి, ఆధునికత యొక్క గర్వము వలన పాత విషయములను

> **మనము చిన్న చూపు చూస్తాము, కాని వాస్తవానికి, ఇది ఒక తత్వవాద ఊహ మాత్రమే, మరియు దీనిని మనము బైబిలులో చూడము.**
>
> — రెవ. మైఖేల్ జే. గ్లోడో

ప్రపంచ మతముల మీద ఆరంభ ఆధునిక దృక్పథములు ఇశ్రాయేలు విశ్వాసము యొక్క పురోగమనమును బైబిలు వర్ణించు విధానమునకు పూర్తిగా భిన్నమైనవిగా ఉన్నాయి. ఇశ్రాయేలు యొక్క విశ్వాసము ఆరంభము నుండే ఏకేశ్వరవాదముగా ఉన్నదని పంచగ్రంథము స్పష్టముగా తెలియజేస్తుంది. ఆదాము నుండి హవ్వ, నోవహు, తరువాత పితరులు, మరియు తరువాత ఇశ్రాయేలు గోత్రముల నాయకుల వరకు, అందరు సర్వమును సృజించిన సృష్టికర్తగా ఏక సత్య దేవుని నమ్మకముగా ఆరాధించారు. మరియు, ఆదికాండము మనము తెలియజేయుచున్న విధముగా, ఈ ఆరంభ దశలలో, ఈ నిజమైన ఏకేశ్వరవాద విశ్వాసము ఒక తరము నుండి మరొక తరమువారికి మౌఖిక మరియు ఆచార పరంపరల ద్వారా అందించబడింది.

తరువాత, పంచగ్రంథము ప్రకారం, మోషే దినములలో ఒక నిర్ణయాత్మకమైన మార్పు చేటుచేసుకుంది. ఈ కాలములో, ఇశ్రాయేలు విశ్వాసము యొక్క ప్రమాణములు వ్రాయబడుట ఆరంభమైయ్యింది. మొదటిగా నిబంధన గ్రంథములో దేవుని ధర్మశాస్త్రమును మరియు పది ఆజ్ఞలను వ్రాయుట ద్వారా, తరువాత మనము చూడబోవుచున్నట్లు, ఇశ్రాయేలు విశ్వాసమును నియంత్రించుటకు పంచగ్రంథములోని మిగిలిన భాగములను రచించుట ద్వారా మోషే ఇశ్రాయేలును దేశముగా స్థాపించబడుటకు సిద్ధపరచాడు. కాబట్టి, బైబిలు ప్రకారం, ఇశ్రాయేలుకు రాజు మరియు దేవాలయము ఇవ్వబడుటకు చాలా కాలం కిత్రమే మోషే కాలము నుండే ఇశ్రాయేలు యొక్క మతము పవిత్రమైన రచనల మీద దృష్టిపెట్టింది.

ఈ సుపరిచితమైన బైబిలు కథనము ఎంత సూటిగా ఉన్నప్పటికీ, ప్రాకృతికవాద చరిత్రాధ్యయనం యొక్క ఊహల వలన ఆధునిక విమర్శ ఈ విషయములను అసాధ్యములుగా ఎంచింది. ఆధునిక విమర్శనాత్మక పండితులు ఇశ్రాయేలు విశ్వాసమును గూర్చి బైబిలు ఇచ్చిన వర్ణనును విడదీయుటకు ప్రయత్నించారు. మరియు పురాతన మతముల పురోగతిని గూర్చి ఆధునిక ఆలోచనలకు అనుగుణంగా దానిని పునర్నిర్మించుటకు ప్రయత్నించారు. ఈ దృక్పథము ప్రకారం, ఇశ్రాయేలు యొక్క చరిత్రపూర్వ పితరులు గిరిజన ఆత్మల ఆరాధనను చేశారు. తరువాత, ఇశ్రాయేలు యొక్క పితరులు తమ గోత్రములు ముఖ్యపాలితములుగా కలిసినప్పుడు బహుదేవతారాధనను హత్తుకున్నారు. ఈ అభిప్రాయం ప్రకారం, ఇశ్రాయేలును ఐగుప్తులో నుండి మోషే బయటకు నడిపించియుంటే, అతడు నడిపించిన ఇశ్రాయేలీయులు అనేక దేవతలలో ఒక దేవుని ఉన్నతముగా పూజించిన గోత్రముల సమాఖ్యలుగా మాత్రమే ఉన్నారు. మరియు, లేఖనములకు విరుద్ధముగా, సామాజిక అభివృద్ధి యొక్క ఈ దశలో, ఇశ్రాయేలు విశ్వాసము యొక్క ప్రమాణములను వ్రాయుట అసాధ్యము అని విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు నమ్మారు. అట్టి ప్రామాణిక రచనలు ఇశ్రాయేలులో రాజుల పరిపాలన ఆరంభమైనప్పుడు, ఇశ్రాయేలు రాజులు మరియు యాజకులు ఇశ్రాయేలు విశ్వాసమునకు దారి చూపుటకు ప్రయత్నించినప్పుడు మాత్రమే వెలుగులోకి వచ్చియుండవచ్చు. కాబట్టి, విమర్శనాత్మక పండితుల ఆలోచన ప్రకారం, రాజుల పరిపాలన కాలము నుండి మాత్రమే ఇశ్రాయేలు యొక్క మతము పుస్తకములలో వ్రాయబడుట ఆరంభమైయ్యింది.

లేఖనము మరియు ఇశ్రాయేలు విశ్వాసము యొక్క చారిత్రిక పురోగమనములను గూర్చి ఆధునిక విమర్శనాత్మక విధానముల యొక్క పూర్వభావత్వములను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు మనము దీనికి దగ్గర సంబంధము కలిగియున్న రెండవ విషయమును చూద్దాము. పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వమును గూర్చిన విమర్శనాత్మక విధానములను ఈ దృక్పథములు ఏ విధంగా ప్రభావితం చేశాయి?

## గ్రంథకర్తృత్వము

మనము ఇంతకు ముందు చూసినట్లు, ఇశ్రాయేలు యొక్క విశ్వాసమును గూర్చి ఇశ్రాయేలును రాజులు పరిపాలించిన కాలము నుండి మాత్రమే వ్రాయుట ఆరంభించారని విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు నమ్మారు. అవును, పంచగ్రంథమును వ్రాయుటలో మోషేకు ఎలాంటి ప్రమేయం లేదు అని దీని అర్థము. పురాతన మౌఖిక పరంపరలలో సుదీర్ఘమైన, క్లిష్టమైన ప్రక్రియగా ఆరంభమై రాజుల పరిపాలన కాలములో పలు ప్రతులలో లిఖించబడుట ద్వారా ఈ పుస్తకములు వెలుగులోకి వచ్చాయి. మరియు ఇశ్రాయేలు చెరలోకి వెళ్లిన తరువాత మరియు చెర నుండి తిరిగివచ్చిన తరువాత మాత్రమే ఈ ప్రతులు సంపాదకీయం చేయబడి పంచగ్రంథముగా సేకరించబడినది. ఇప్పుడు, పంచగ్రంథ పురోగమనము యొక్క సుదీర్ఘ చరిత్రను పండితులు నమ్ముతున్నారు అని లేఖన విద్యార్థులు మొట్టమొదటిసారి విన్నప్పుడు, దీనికి ఆధారములు ఏమిటి అని వారు ఆశ్చర్యపడుతుంటారు.

విమర్శనాత్మక పండితులు అందించిన మూడు ప్రధానమైన రుజువులను క్రోడీకరించుట ద్వారా పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వము పట్ల ఉన్న ఈ ధోరణిని చూద్దాము. పంచగ్రంథములో దేవునికి ఇవ్వబడిన పేర్లలో ఉన్న వైరుధ్యములను చూద్దాము.

### దేవుని పేర్లు

పంచగ్రంథములో దేవునికి అనేక రకముల పేర్లు ఇవ్వబడినవని ఆరంభ విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు గుర్తించారు. మరియు ఈ వైరుధ్యములు ఇశ్రాయేలు విశ్వాసము యొక్క సుదీర్ఘమైన పురోగతికి ఆధారములుగా ఉన్నాయని వారు వాదించారు. ఉదాహరణకు, కొన్నిసార్లు పంచగ్రంథము אֱלֹהִים (ఎలోహిం) లేక "దేవుడు" అను హెబ్రీ పదమును మాత్రమే ఉపయోగిస్తాయి. మరికొన్నిసార్లు, దేవుడు יהוה (యాహ్వె) లేక "యెహోవా" అని పిలువబడ్డాడు. పంచగ్రంథము ఈ పదములను ఒకదానితో మరొకదానిని మరియు ఇతర పదములను కలిపి ఉపయోగిస్తుంది, *"యాహ్వె ఎలోహిం"* లేక "యెహోవా దేవుడు," మరియు *"యాహ్వె యీరే,"* లేక "యెహోవా యీరే" వలె. దేవుడు *"ఎల్ ఎల్యోన్"* లేక "సర్వోన్నతుడైన దేవుడు." మరియు *"ఎల్ షద్దాయ్"* లేక "సర్వశక్తిగల దేవుడు" అని కూడా పిలువబడ్డాడు.

ఇప్పుడు, పంచగ్రంథము దేవునికి అనేక పేర్లు ఉపయోగించినప్పటికీ, ఇది ఒక అసాధారణమైన విషయము ఏమి కాదని గమనించుట చాలా అవసరము. ఇతర పురాతన పశ్చిమ ఆసియాలోని మతములలో దేవుని పేర్లను గూర్చి ఇరవైయ్యవ శతాబ్దములో చేయబడిన ఒక పరిశోధన, ఒకే రచయితలు తమ దేవతల కొరకు అనేక పేర్లను ఉపయోగించిన విషయమును తెలియజేసింది. అయినను, పంచగ్రంథములో దేవుని పేర్లలో ఉన్న వైరుధ్యములు వాటి సంపాదకీయమునకు సుదీర్ఘమైన

చరిత్ర ఉన్నట్లు బయలుపరుస్తుందని ఆరంభ విమర్శనాత్మక పండితులు ఆలోచించారు. దేవునికి ఇవ్వబడిన అనేక పేర్లు ఒక మూలము మరొక మూలముతో, ఆ మూలము ఇంకొక మూలముతో జతపరచబడుట వలన తుదకు పంచగ్రంథము వెలుగులోనికి వచ్చినట్లు సూచిస్తుందని వారు నమ్మారు.

> మీరు పాత నిబంధన అంతటిని చదువునప్పుడు, దేవునికి వేర్వేరు పేర్లు ఉన్నాయని గుర్తించుటకు ఎక్కువ సమయం పట్టదు. ఆదికాండము 1లో దేవునికి ఎలోహీం అని పేరు. ఆదికాండము 2లో, ఒక్కసారిగా, ఆయనకు యెహోవా అను నామము ఇవ్వబడినది. విమర్శనాత్మక విధానములు దీనిని ఇవాంజెలికల్ క్రైస్తవుల కంటే భిన్నముగా అర్థము చేసుకుంటారు. ఇవి వేర్వేరు మూలముల నుండి వచ్చాయని విమర్శనాత్మక పండితులు చెబుతారు... ఇవాంజెలికల్ క్రైస్తవులముగా, మనము ఒకసారి వెనుకకు తిరిగి విశాలమైన నేపథ్యమును అర్థము చేసుకొనవలసియున్నది. దేవుడు ఎలోహీం అయ్యున్నాడు, మరియు ఆయన యెహోవా కూడా అయ్యున్నాడు. ఎలోహీం సర్వశక్తిగల దేవుడు, ఆయన లోకము పైన, సృష్టిపైన అధికారిగా ఉన్నాడు, ఆయన ఉన్నతమైన శక్తి అయ్యున్నాడని, సర్వోన్నతమైన ప్రభువైయున్నాడని లోకములోని దేశములన్నీ గుర్తిస్తాయి. అయితే ఇశ్రాయేలు దేశముతో నిబంధన అనుబంధములో, ఆయన తనను తాను యెహోవా అను ఒక వ్యక్తిగతమైన పేరుతో బయలుపరచుకున్నాడు. ఆయన తన ప్రజల కొరకు మరియు ప్రజలతో ఉండువాడైన "ఉన్నవాడు." మరియు ఇది ఒక నిబంధన నామమైయున్నది ఎందుకంటే ఇశ్రాయేలు దేవుడు ఏర్పరచుకొనిన ప్రజలైయున్నారు.
>
> — డా. డేవిడ్ టల్లే

దేవుని పేర్లలో వైరుధ్యముతో పాటుగా, వారు "నకిలీ కథనములు" అని పిలిచినవాటి వైపుకు దృష్టిని ఆకర్షించుట ద్వారా పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వమును గూర్చి వారు కలిగియుండిన అభిప్రాయములను అనేకమంది విమర్శనాత్మక పండితులు సమర్థించారు.

### నకిలీ కథనములు

పంచగ్రంథములో ఉన్న అనేక వాక్యభాగములు ఇతర వాక్యభాగములను పోలినవిగా ఉన్నాయని చూచుట అంత కష్టమేమి కాదు. ఈ వాక్యభాగములు వేర్వేరు ప్రజల గుంపులలో ఉండిన వేర్వేరు మౌఖిక పరంపరలను, పంచగ్రంథములో ఈ కథనములు వ్రాయబడిన ప్రక్రియలను ప్రతిబింబిస్తాయని విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు వాదించారు.

ఉదాహరణకు, ఆది. 1:1-2:3లో మరియు ఆది. 2:4-25లో ఉన్న "రెండు సృష్టి కథనములు" అని వారు పిలచువాటిని వ్యాఖ్యానకర్తలు తరచుగా చూపుతుంటారు. ఆది. 12:10-20; 20:1-18; మరియు 26:7-11లో అబ్రాహాము మరియు ఇస్సాకులు అబద్ధమాడి తమ భార్యల జీవితములను అపాయములోకి నెట్టిన కథనముల మధ్య ఉన్న పోలికలను కూడా వారు ఎత్తిచూపారు. సాంప్రదాయిక యూదా మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

క్రైస్తవ వ్యాఖ్యానకర్తలు ఈ పోలికలను అర్థవంతమైన విధానములలో వివరించారు. అయితే ఈ కథనములు పలు మౌఖిక పరంపరలకు ప్రాతినిధ్యం వహిస్తాయని, తరువాత అవి వ్రాయబడి పంచగ్రంథములో చేర్చబడినవని విమర్శనాత్మక పండితులు చెబుతారు.

మూడవదిగా, విమర్శనాత్మక పండితులు పంచగ్రంథములో వారు అసమానతలుగా గుర్తించిన వాటిని ఎత్తిచూపుతారు. మరియు ఈ ఆరోపించబడిన అసమానతలు బైబిలులోని ఈ భాగము యొక్క గ్రంథకర్తృత్వమునకు వారు చేసిన క్లిష్టమైన పునర్నిర్మాణములకు మద్దతునిస్తాయని తెలిపారు.

## అసమానతలు

ఉదాహరణకు, నిర్గమ. 12:1-20 మరియు ద్వితీ. 16:1-8లో పస్కా కొరకు ఇవ్వబడిన నియమముల మధ్య ఉన్న భేదములను వారు తరచుగా ఎత్తి చూపారు. మరియు నిర్గమ. 20:1-17 మరియు ద్వితీ. 5:6-21లో ఇవ్వబడిన పది ఆజ్ఞల మధ్య ఉన్న భేదములను కూడా వారు చూపారు. మరొకసారి, సాంప్రదాయిక యూదా మరియు క్రైస్తవ వ్యాఖ్యానకర్తలు ఈ భేదములు మరియు అనేక ఇతర భేదముల మధ్య సంధిని ఎలా చేయాలో చూపారు. అయితే అవి సుదీర్ఘమైన, క్లిష్టమైన మౌఖిక పరంపరల చరిత్రను మరియు నేడు మనకు అందుబాటులో ఉన్న విధముగా పంచగ్రంథములో అల్లిక చేయబడియున్న వ్రాయబడిన మూలములను ప్రతిబింబిస్తున్నాయని విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు వాదించారు.

> మీరు బైబిలును, ముఖ్యముగా పంచగ్రంథమును చదివినప్పుడు, మీరు అనేక రకముల సాహిత్యములను ఎదుర్కొంటారు. మరియు కొన్నిసార్లు మీరు వాటిని చదివినప్పుడు, మీరు ఆదికాండము గ్రంథము ఆరంభములో ఆది. 1:1-2:3 భాగములో ఉన్న విషయములను చదివినప్పుడు… దేవుడు ఏడు దినముల వ్యవధిలో సృష్టించిన ఒక ప్రత్యేకమైన క్రమము ఉన్నది. దేవుడు తన నోటి మాట ద్వారా సృష్టిని చేశాడు, మరియు అది దేవుని యొక్క శక్తిని గూర్చి, దేవుడు సృష్టికర్తగా ఉండుటను గూర్చి, దేవుడు తన రూపములో మానవాళిని చేయుటను గూర్చి ఒక అద్భుతమైన కథనమును ఇస్తుంది. మరియు తరువాత అధ్యాయములోనే, 2:4-25లో, ఒకదాని తరువాత మరొకటి వచ్చినట్లు అక్కడ మరొక సృష్టి వృత్తాంతము ఉన్నది. దానిని మీరు చూసినప్పుడు, అక్కడ దేవుడు దేవుడైన యెహోవా అని పిలువబడ్డాడు కాబట్టి కొందరు దానిలో వైరుధ్యములను చూస్తారు. మాట ద్వారా సృష్టిని చేసిన దేవునికి భిన్నముగా, క్రిందికి దిగివచ్చిన దేవుని మనము చూస్తాము; ఆయన ప్రజలను సృష్టించాడు. ఆయన మొదటి మానవుడైన పురుషుని మంటిలోనుండి చేశాడని అది చెబుతుంది. మరియు ఆయన మొదటి స్త్రీని పురుషునిలో నుండి తీశాడు. కాబట్టి, మీరు దేవుని చూస్తున్నారు, అదృశ్యమైన సృష్టికర్త దేవునిగా ఉండక, దేవుడు మానవ రీతులలో దిగివచ్చి, తన చేతులతో సృజించుట ఆరంభించాడు… అయితే వేరొక వృత్తాంతము వైరుధ్యముగా లేదుగాని పరిపూరకమైనదిగా ఉన్నది…మరలా, ఒకవేళ వైరుధ్యములు నిజముగా ఉంటే పురాతన ప్రజలు వాటిని చూడలేదా? అను

> విషయమును మనము జ్ఞాపకముంచుకోవాలి. అంటే, ఇది ప్రాముఖ్యమైన విషయము. వారు మూర్ఖులు కారు. అది వేరే కాలము, వేరే సంస్కృతి, అయినప్పటికీ వారికి కూడా మెదడులు ఉండేవి, మరియు వారు తమ జ్ఞానములో ఈ విషయములను కలిపి ఉంచారు. కాబట్టి రెండవ వృత్తాంతము మనకు క్రిందికి దిగివచ్చిన దేవుని గూర్చి వర్ణిస్తుంది. దీనిని మనము వేదాంతశాస్త్రములో అంతర్ వ్యాప్తి కలిగిన దేవుడు అని పిలుస్తాము, అనగా సృష్టిలోనికి దిగివచ్చిన దేవుడు... లేఖనములను నమ్మకముగా చదువుట అంటే సందేహముతో చదువుట కాదుగాని, దానిని అర్థము చేసుకొనుటకు చదువుట అని నా అభిప్రాయము. నా ఎదుట చాలా ప్రశ్నలు ఉండవచ్చు, కాని అది విశ్వాసము యొక్క అర్థమును వెదకునదిగా ఉండాలి, మరియు తుదకు, బైబిలులో ఉన్నవన్ని దేవుడు బైబిలులో ఉండాలని నిర్ణయించిన విషయములే, మరియు పాఠకునిగా నా పని దానిని శ్రద్ధగా వినడమే, ముఖ్యముగా నన్ను ఇబ్బంది పెట్టు స్థలములను శ్రద్ధగా అధ్యయనం చేసి, ఈ రెండు విషయములను ఇక్కడ ఈ విధంగా ఉంచుట ద్వారా దేవుడు ఏమి తెలియజేయగోరుతున్నాడో చూచుట నా పని అయ్యున్నది. కాని వాటిని బట్టి మనము కృతజ్ఞులమైయ్యుండాలి, ఎందుకంటే అనేక సమయాలలో, అనేక స్థలములలో ఆ రెండు రకముల చిత్రములు ఒకసారి కాకపోతే మరొకసారి మరింత అర్థవంతముగా మాట్లాడతాయి.
>
> — డా. బ్రియన్ డి. రస్సెల్

వాటి పూర్వభావిత్వములు మరియు గ్రంథకర్తృత్వమును గూర్చిన అభిప్రాయముల దృష్ట్యా ఆధునిక విమర్శనాత్మక విధానములను మనము చూశాము కాబట్టి, ఇప్పుడు పంచగ్రంథముతో వ్యవహరించుచుండగా విమర్శనాత్మక పండితులు అనుసరించిన కొన్ని ముఖ్యమైన వ్యాఖ్యాన వ్యూహములను చూచుటకు మనము సిద్ధముగా ఉన్నాము.

## వ్యాఖ్యాన వ్యూహములు

ఈ విషయములను క్రోడీకరించుటకు అనేక మార్గములు ఉన్నాయిగాని, ఆధునిక విమర్శనాత్మక పండితుల యొక్క ఐదు ప్రధానమైన వ్యాఖ్యాన వ్యూహాలను మనము చూద్దాము. అవి అభివృద్ధి చెందిన క్రమములో ఈ వ్యూహములను మనము చూద్దాము, మూల విమర్శతో ఆరంభిద్దాము.

### మూల విమర్శ

మూల విమర్శ, లేక అది ఆరంభములో పిలువబడినట్లు, "సాహిత్య విమర్శ," కే. హెచ్. గ్రాఫ్ వ్రాసిన 1866లో ముద్రించబడిన *ది హిస్టారికల్ బుక్స్* ఆఫ్ ది ఓల్డ్ టెస్టమెంట్ అను పుస్తకములో నుండి వెలువడింది. సుపరిచిత వ్యాఖ్యానకర్తయైన, జూలియస్ వెల్హౌసన్ రచించిన 1883లో ముద్రించబడిన *ప్రోలేగొమెన టూ ది హిస్టరీ ఆఫ్ ఇశ్రాయెల్* అను పుస్తకములో ఇది శుద్ధిచేయబడింది.

ఇతర పురాతన మత సంబంధమైన రచనల వలెనె పంచగ్రంథము కూడా మౌఖిక పరంపరలలో నుండి వెలువడింది అని మూల విమర్శకులు నమ్మారు. అయితే ఇశ్రాయేలును రాజులు పాలించిన కాలములో ఆవిర్భవించిన స్వతంత్ర సాహిత్య మూలములలో నుండి వెలువడినవని వారు నమ్మిన పంచగ్రంథములోని భాగములను గుర్తించుట మీద మరియు వాటిని వ్యాఖ్యానించుట మీద వారు ఎక్కువ దృష్టిపెట్టారు.

వెల్హౌసన్ పరిభాషను ఉపయోగించి, రాజుల పరిపాలన యొక్క ఆరంభములో వ్రాయబడిన పంచగ్రంథము యొక్క మొట్టమొదటి లిఖిత రూప మూలమును సాధారణంగా యహ్విస్ట్ లేక "J" అని పిలుస్తారు. దీనికి ఈ పేరు ఎందుకు ఇవ్వబడింది అంటే, ఈ లిఖిత రూప మూలములో దేవుని కొరకు ఉపయోగించబడిన ప్రాముఖ్యమైన పేరు *"యాహ్వే"* — ఆంగ్ల భాషలో *"జెహోవా"* అను పేరు వలెనే ఇది జర్మన్ భాషలో "J" అక్షరముతో ఉచ్చరించబడుతుంది. "J" వాక్యభాగములు ఆదికాండము మరియు నిర్గమకాండము గ్రంథములలో చెదరియున్నాయి. పంచగ్రంథములోని భాగములు సుమారుగా క్రీ.పూ. 950లో సొలొమోను దినములలో యూదా ప్రాంతములో వ్రాయబడినవని కొందరు విమర్శకులు వాదించారు. ఈ దృక్కోణములో, "J" వాక్యభాగములు పురాతన కాలములను గూర్చి తెలియజేయు ప్రతుని సూచించి, యెరూషలేములో దావీదు సామ్రాజ్యము ద్వారా ఇశ్రాయేలీయుల మతము మరియు సమాజము కేంద్రీకృతము చేయబడిన మరియు నియంత్రించబడిన విషయమును సమర్థిస్తాయి.

పంచగ్రంథము యొక్క రెండవ లిఖిత మూలమును "E," అనగా ఎలోహిస్ట్ అని పిలుస్తారు, ఎందుకంటే ఈ వాక్యభాగములో దేవుడు సాధారణంగా *ఎలోహీం* అను పేరుతో పిలువబడ్డాడు. "E" వాక్యభాగములు కూడా ఆదికాండము మరియు నిర్గమకాండములలో ఉన్నాయి. ఈ సిద్ధాంతం ప్రకారం, "E" మూలములు ఇశ్రాయేలు రెండు రాజ్యములుగా విభజించబడిన తరువాత క్రీ.పూ. 850లో ఉత్తర దేశములో వ్రాయబడినవి. "E" వాక్య భాగములు దావీదు సింహాసనపు రాజులను విమర్శించిన ఉత్తర దిక్కునకు చెందిన ప్రవచన అభిప్రాయములను వ్యక్తపరచాయి.

మూడవ సాహిత్య మూలమును "D," లేక డ్యూటిరోనోమిస్ట్ అని పిలుస్తారు. దీనికి ఈ పేరు ఎందుకు ఇవ్వబడింది అంటే "D" వాక్యభాగములు ప్రధానముగా ద్వితీయోపదేశకాండములో కనిపిస్తాయి మరియు పంచగ్రంథములోని ఇతర భాగములలో చెదురుగా కనిపిస్తాయి. ఈ సాహిత్యము సాధారణముగా క్రీ.పూ. 622లో యోషియా యొక్క సంస్కరణలకు మరియు క్రీ.పూ. 586లో బబులోనీయుల చేతులలో యెరూషలేము యొక్క పతనమునకు మధ్య కాలములో వ్రాయబడినవి. ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలు నుండి యూదాకు పారిపోయిన లేవీయుల రచనలను "D" సూచిస్తుంది అని ఒక సామాన్య సిద్ధాంతము తెలియజేస్తుంది. ఈ లేవీయులు దావీదు కుటుంబమునకు నమ్మకముగా ఉండేవారుగాని, విమర్శించేవారు కూడా.

చివరిగా, పంచగ్రంథ పురోగమనములోని నాల్గవ ప్రధానమైన సాహిత్య మూలమును సాధారణంగా "P" అని పిలుస్తారు, ఇది ప్రీస్ట్లీ లేక యాజక రచయితను లేక రచయితలను సూచిస్తుంది. ఒక సామాన్య పునర్నిర్మాణము ప్రకారం, "P" క్రీ.పూ 500 మరియు 400 మధ్య కాలములో లేవీయకాండమును రచించిన మరియు పంచగ్రంథములోని ఇతర భాగములను సంపాదకీయము చేసిన యాజకుల గుంపైయున్నది. ఈ పునర్నిర్మాణం ప్రకారం, చెరలో నుండి ఇశ్రాయేలు యొక్క శేషము తిరిగివచ్చిన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

తరువాత వారి సామాజిక క్రమమును మరియు ఆరాధనను నియంత్రించుటకు “P” పంచగ్రంథమును రూపొందించింది.

ఇప్పుడు, ఇరవైయ్యవ శతాబ్దములో, యోగ్యులైన పండితులు మూల విమర్శలో ఉన్న ఇంచుమించు ప్రతి విషయమును సవాల్ చేశారు. అయినను, ఈ దృక్పథముల యొక్క అవశేషములు నేటికి కూడా పంచగ్రంథము యొక్క ప్రతి విమర్శనాత్మక వ్యాఖ్యానములో కనిపిస్తాయి.

## రూప విమర్శ

పంచగ్రంథముల పట్ల విమర్శనాత్మక విధానముల యొక్క రెండవ ప్రధానమైన వ్యూహమును “రూప విమర్శ” అని పిలుస్తారు.

రూప విమర్శ 1901లో హెర్మన్ గుంకెల్ వ్రాసిన *ది లెజెండ్స్ ఆఫ్ జెనిసిస్* అను పుస్తకము ద్వారా పాత నిబంధన అధ్యయనములలో ఒక విశేషమైన విభాగముగా ఆరంభమైయ్యింది. గుంకెల్ మరియు అతని అనుచరులు మూల విమర్శలోని ముఖ్యమైన విషయములన్నిటిని అంగీకించారుగాని, పంచగ్రంథ ఆవిర్భావము విషయములో మాత్రం మునుపటి కోణము మీద దృష్టిపెట్టారు. పంచగ్రంథము యొక్క రచనా మూలముల మీద దృష్టిపెట్టుటకు బదులుగా, ఇశ్రాయేలును రాజులు పరిపాలించిన కాలమునకు ముందు ఉన్న మౌఖిక పరంపరల మీద రూప విమర్శకులు దృష్టి పెట్టారు.

రూప విమర్శ విస్తరించిన కాలములో, నిరక్షరాస్యులైన గిరిజన సంస్కృతులలో మౌఖిక పరంపరలు పని చేసిన విధానముల మీద పండితులు దృష్టిపెట్టారు. పంచగ్రంథము యొక్క ప్రతుల మూలములకు దారి తీసిన శుద్ధమైన, క్రియాశీలకమైన, సాహిత్యకాలమునకు-ముందు ఉన్న పరంపరల కొరకు వెదకుచు రూప విమర్శకులు ఈ అధ్యయనములను అనువర్తించారు.

రూప విమర్శ యొక్క విధానము సాధారణంగా రెండింతలుగా ఉన్నది: ఒక వైపున, పురాణములు, జానపద-కథలు, వీరగాథలు, ప్రేమ కథలు, ఇతిహాసములు మరియు ఉపమానముల వంటి ప్రాచీన మౌఖిక రూపములను లేక సాహిత్య రకములను కనుగొనుటకు రూప విమర్శకులు వాక్యభాగములను విశ్లేషించారు. మరొక వైపున, వారు ఈ సాహిత్య రకములను *“సిట్జ్ యిం లెబెన్”* లేక ఈ మౌఖిక పరంపరల యొక్క “జీవిత నేపథ్యములు” అని పిలువబడు సాంస్కృతిక నేపథ్యములకు అనుసంధానపరచారు. ఈ నేపథ్యములలో ఆరాధన, గోత్రములు గుడారములు వేసిన స్థలములు, కుటుంబ హెచ్చరిక, స్థానిక న్యాయాలయములు మొదలగునవి ఉన్నాయి.

ఉదాహరణకు, ఆది. 32:22-32లో యాకోబు పెనూయేలు యొద్ద చేసిన పెనుగులాటను గూర్చిన కథనమును వాస్తవానికి పురాతన గోత్రములు మంట చుట్టు కూర్చునప్పుడు చెప్పబడిన కథగా పరిగణిస్తారు. యబ్బోకు రేవు యొద్ద జరిగిన అసాధారణమైన, నాటకీయమైన సన్నివేశములలో నుండి ఇది మొదట వెలువడింది అని వారు వాదించారు. ఈ పునర్నిర్మాణములో, చాలా కాలం తరువాత మాత్రమే ఈ వృత్తాంతము గిరిజన నాయకుడైన యాకోబుకు ఆపాదించబడింది.

ఖచ్చితముగా, రూప విమర్శ బైబిలు వాక్యభాగముల యొక్క నిర్మాణములు మరియు రూపక లక్షణముల యొక్క ప్రాముఖ్యతను సరిగానే ఉద్ఘాటించింది. అయితే, మూల విమర్శ వలెనె, రూప విమర్శ కూడా అనేక విధాలుగా సవాల్ చేయబడింది. రూప విమర్శ ఎదుర్కొన్న సవాళ్ళు ముఖ్యముగా బైబిలు వాక్యభాగముల వెనుక ఉన్న మౌఖిక రూపములు మరియు నేపథ్యముల యొక్క

ఊహాజనకమైన పునర్నిర్మాణముల మీద దృష్టిపెడతాయి. అయినను, నేడు కూడా రూప విమర్శను ఉపయోగించు అనేకమంది విమర్శనాత్మక పండితులు, లేఖనముల ప్రామాణికతలో ఉన్న విధముగా పంచగ్రంథమును అధ్యయనం చేయకుండా ప్రశ్నార్థకమైన పునర్నిర్మాణములకు పూనుకుంటారు.

## పారంపరిక విమర్శ

విమర్శనాత్మక పండితులు పంచగ్రంథమును వ్యాఖ్యానించిన మూడవ ప్రధానమైన మార్గమును పారంపరిక విమర్శ లేక పారంపరిక-చారిత్రిక విమర్శ అని పిలుస్తారు.

మూల మరియు రూప విమర్శలలో వెలువడిన విషయముల మీద నిర్మిస్తూ, పారంపరిక విమర్శకులు ప్రాచీన మౌఖిక పరంపరలు మరియు వ్రాయబడిన ప్రతులు క్లిష్టమైన వేదాంతశాస్త్ర మరియు రాజకీయ దృక్పథములుగా అభివృద్ధి పొందిన విధానముల మీద దృష్టిపెట్టారు. 1948లో *ఏ హిస్టరీ ఆఫ్ పెంటట్యుకల్ ట్రెడిషన్స్* అను పుస్తకమును ప్రచురించిన మార్టిన్ నార్త్, మరియు 1957లో *థియోలజి ఆఫ్ ది ఓల్డ్ టెస్టమెంట్* అను పుస్తకమును ప్రచురించిన గెర్హార్డ్ వాన్ రాడ్ వంటి ప్రసిద్ధిగాంచిన పండితులు, పలు పరంపరల యొక్క ప్రభావమును పంచగ్రంథము ఏ విధంగా ప్రతిబింబించినది అని ప్రశ్నించారు.

అనేక ఇతర విషయములతో పాటు, పంచగ్రంథములో వైరుధ్యము కలిగియున్న వేదాంతశాస్త్ర నమ్మకములను పారంపరిక విమర్శకులు గుర్తించారు. సృష్టి, పితరులు, ఐగుప్తు నుండి నిర్గమనము, మరియు వాగ్దాన దేశమును స్వాధీనపరచుకొనుట వంటి అంశముల మీద భిన్నమైన పరంపరల యొక్క కలయికను పంచగ్రంథము ప్రతిబింబించినదని వారు గుర్తించారు. ఇశ్రాయేలు గోత్రములు, దావీదు సింహాసనము, మరియు యెరూషలేము దేవాలయము వంటి ఇతర అంశములను కూడా వారు విశ్లేషించారు. మరియు వేదాంతశాస్త్రము యొక్క ఈ క్లిష్టమైన విభాగములు పంచగ్రంథములో కనిపించు అనేక ప్రధానమైన అంశముల మీద ప్రభావము చూపాయని వారు నమ్మారు.

మరొకసారి, పారంపరిక విమర్శ ఇచ్చిన ఫలితములను ప్రజలు అనేక సంవత్సరములుగా ప్రశ్నించుచున్నారు. అయినను, ఇశ్రాయేలు దేశములోని పరంపర యొక్క పలు శాఖలు ఒకదానికి విరోధముగా మరొకటి ఉన్న లేక పోటీపడుతున్న వాక్యభాగములను గూర్చి పాత నిబంధన వ్యాఖ్యానకర్తలు మాట్లాడునప్పుడు దీని జాడలు మనము చూడవచ్చు.

## సంపాదకీయ విమర్శ

విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు పంచగ్రంథ పురోగమనమును కనుగొనుటకు ప్రయత్నించిన నాల్గవ ప్రధానమైన మార్గమును సంపాదకీయ విమర్శ అని పిలుస్తారు. "సంపాదకీయ" అను పదము సూచించుచున్నట్లు, ఈ వ్యూహము కొన్ని సందేహాస్పదమైన ప్రతులు మనము నేడు కలిగియున్న పంచగ్రంథముగా ఏ విధంగా సంపాదకీయము చేయబడినవి అను విషయము మీద దృష్టిపెడుతుంది.

క్రొత్త నిబంధనలోని సువార్తల మధ్య ఉన్న భేదములను వివరించుటకు సంపాదకీయ విమర్శ పంతొమ్మిదవ శతాబ్దములో క్రొత్త నిబంధన అధ్యయనములలో ఆరంభమైయ్యింది. మునుపు వ్రాయబడిన నివేదికలను సంపాదకీయము చేయుట ద్వారా మరియు పునర్నిర్మించుట ద్వారా ఈ భేదములు వెలువడినవని సంపాదకీయ విమర్శకులు నమ్మారు.

పంచగ్రంథమునకు కూడా ఇవే విధానములు ఉపయోగించబడినవి. అనేకమంది సంపాదకీయులు “J”, “E”, మరియు “D” వంటి వ్రాతపూర్వక మూలములను తీసుకొని నేడు మనము కలిగియున్న విధముగా పంచగ్రంథమును ఏ విధంగా అమర్చారో వివరించుటకు ప్రయత్నాలు జరిగాయి. ఈ పద్ధతి ముఖ్యముగా “P” యొక్క ఆలస్యపు సంపాదకీయ కార్యము మీద దృష్టిపెట్టింది.

సంపాదకీయ విమర్శ నేడు మనము బైబిలులో కలిగియున్న విధముగా ఆదికాండము నుండి ద్వితీయోపదేశకాండము వరకు ఉన్న గ్రంథముల వైపునకు దృష్టిని ఆకర్షిస్తుంది. అయితే సంపాదకీయ విమర్శ మూల, రూప మరియు పారంపరిక విమర్శలు ఇచ్చిన ఫలితముల నుండి ఏ నాడు వేరు కాలేదు.

### సమకాలపు విమర్శ

ఈ సమయములో, మనము సమకాలపు విమర్శను తీర్చిదిద్దిన కొన్ని ధోరణులను, లేక పంచగ్రంథము పట్ల ప్రస్తుత ప్రసిద్ధిగాంచిన క్లిష్ట విధానములను ప్రస్తావించాలి.

ఈ మధ్య దశాబ్దములలో, అనేకమంది ప్రసిద్ధిగాంచిన విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు పాత విమర్శనాత్మక చారిత్రిక పునర్నిర్మాణములను దాటి వెళ్లుటకు ప్రయత్నించారు. వారు పంచగ్రంథము యొక్క సాంప్రదాయిక హెబ్రీ లేఖనములోని విశేషమైన వేదాంతశాస్త్ర ఐక్యత మరియు లోతు మీద దృష్టిపెట్టారు. ఈ విధానములు అనేక రూపములను తీసుకున్నాయి — అలంకార విమర్శ, ప్రామాణిక విమర్శ, నూతన సాహిత్య విమర్శ వంటివి. అయితే సమాజమందిరము మరియు సంఘము ద్వారా మనకు ఇవ్వబడిన పంచగ్రంథమును వ్యాఖ్యానించుట మీద వారు దృష్టిపెట్టారు. పంచగ్రంథమును నేడు మన మధ్య ఉన్న విధముగా అధ్యయనము చేయుట పాత విమర్శనాత్మక విధానముల కంటే ఉపయోగకరమైనదిగా ఉన్నది. కాని ఈ సమకాలపు విధానములు ఎలాంటి ఫలితములను ఇస్తాయి అను విషయమునకు జవాబు కాలము మాత్రమే చెప్పగలదు.

ఇప్పటి వరకు “పంచగ్రంథము యొక్క పరిచయం” అను మన పాఠంలో, బైబిలులోని మొదటి భాగము పట్ల ఆధునిక విమర్శనాత్మక విధానముల మీద మనము దృష్టిపెట్టాము. ఇప్పుడు ఈ పాఠంలో మన రెండవ ప్రధాన అంశమును మనము చూడవలసియున్నది: పంచగ్రంథము మీద ఆధునిక ఇవాంజెలికల్ దృక్పథములు. నేడు ఇవాంజెలికల్ క్రైస్తవులు బైబిలులోని మొదటి ఐదు పుస్తకములను ఏ విధంగా చూస్తారు?

## ఆధునిక ఇవాంజెలికల్ విధానములు

ఇక్కడ మన ఉద్దేశముల కొరకు ఇవాంజెలికల్ క్రైస్తవులను లేఖనముల యొక్క సంపూర్ణ అధికారమును ఒప్పుకొనువారు అని నిర్వచించిన విషయము మీకు గుర్తుండే ఉంటుంది. ఇవాంజెలికల్ క్రైస్తవులు ఈ నమ్మకమును ఎల్లప్పుడూ ఒక విధముగా అన్వయించలేదని చెప్పనవసరంలేదు. కాని మనము చూడబోవుచున్నట్లు, లేఖనము యొక్క అధికారము పట్ల ఇవాంజెలికల్ క్రైస్తవులు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కలిగియున్న ఈ సమర్పణ ఆధునిక విమర్శనాత్మక పండితుల కంటే భిన్నముగా పంచగ్రంథమును అధ్యయనం చేయునట్లు వారిని పురికొల్పుతుంది.

మనము ఇంతకు ముందు చేసిన చర్చను అనుసరిస్తూ పంచగ్రంథము పట్ల ఆధునిక ఇవాంజెలికల్ దృక్పథములను మనము క్రోడీకరిద్దాము. మొదటిగా, మనలను నడిపించవలసిన కొన్ని ప్రాముఖ్యమైన పూర్వభావిత్వములను మనము చూద్దాము. రెండవదిగా, పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వముపై ఇవాంజెలికల్ దృక్పథములను మనము చూద్దాము. మరియు మూడవదిగా, అనేక ప్రధానమైన ఇవాంజెలికల్ వ్యాఖ్యాన వ్యూహములను మనము సమీక్షించుదాము. కొన్ని ప్రాముఖ్యమైన ఇవాంజెలికల్ పూర్వభావిత్వములతో ఆరంభిద్దాము.

## పూర్వభావిత్వములు

విమర్శనాత్మక మరియు ఇవాంజెలికల్ దృక్పథముల మధ్య ఉన్న భేదములను చూపు రెండు పూర్వభావిత్వములకు మాత్రమే మన చర్చను పరిమితం చేద్దాము. మొదటిగా, లోకాతీతవాదము మీద మన నమ్మకమును పరీక్షించుదాము. రెండవదిగా, ఇశ్రాయేలు విశ్వాసము యొక్క చారిత్రిక పురోగమనమును గూర్చి మన పూర్వభావిత్వములను చూద్దాము. లోకాతీతవాదము మీద మన నమ్మకమును మొదట చూద్దాము.

### లోకాతీతవాదము

> "లోకాతీతము" అను పదమును "ప్రాకృతిక" అను పదమునకు వ్యతిరేకముగా మనము ఆధునిక భాషలో ఉపయోగిస్తాము, మరియు అవును, మనము దేవుని నమ్మువారమైతే, దేవుడు అన్ని విధములుగా కార్యములు చేస్తాడని కూడా నమ్ముతాము. అయితే స్కాటిష్ సందిగ్ధవాద తత్వవేత్తయైన డేవిడ్ హ్యూమే ఒక వ్యత్యాసమును చేసి, "లోకాతీత కార్యములను నమ్ముటకు మన యొద్ద ఏ కారణము లేదు" అని చెప్పిన సమయము నుండి ఇది ఒక సమస్యగా మారింది. మరియు అనేక మంది బైబిలు యొక్క ఆధారయోగ్యతను సవాలు చేయుటకు ఇది ఒక ప్రధానమైన కారణమైయ్యింది, ఎందుకంటే, బైబిలులో చాలా ఆశ్చర్య కార్యములు ఉన్నాయి మరియు ఆశ్చర్య కార్యములు జరుగవని మనకు తెలుసు అని వారంటారు. సరే, ఆశ్చర్యకార్యములు జరగవని మనకు ఎలా తెలుసు? డేవిడ్ హ్యూమే "రుజువు" చేశాడు కాబట్టి. మరియు ఒకసారి ఆగి అతడు చేసిన వాదనను చూస్తే, అతడు చేసిన వాదన అసలు బాగోలేదు అని అర్థమవుతుంది. వాస్తవానికి, ఆశ్చర్య కార్యములు జరిగాయని తెలుపుటకు, మరియు నేడు వాటిని మనము పరీక్షించుటకు ప్రత్యక్ష సాక్షులు లేరు — ఆమోదయోగ్యమైన ప్రత్యక్షసాక్షులులేరు — అనునది అతని వాదనలో ఒక ప్రాముఖ్యమైన భాగమైయున్నది. అయినను, హ్యూమే దినములలో కూడా, దేవుడు ఆశ్చర్య కార్యములు చేయుచున్నాడు అనుటకు అనేకమంది అర్హమైన ప్రత్యక్ష సాక్షులు ఉండిరి, మరియు నేడు కూడా లెక్కలేనన్ని సాక్ష్యములు ఉన్నాయి... మరియు అవి నేడు కూడా

> జరుగుతున్నాయంటే, దేవుడు కార్యము చేయుచుండగా రక్షణ చరిత్రలోని పలు సందర్భాలలో అవి ఇంకా ఎంత ఎక్కువగా జరిగియుండాలి.
>
> — డా. క్రెయిగ్ ఎస్. కీనర్

సాధారణంగా దేవుడు వివేచించదగిన పద్ధతులలో చరిత్రను నడిపిస్తాడని లేఖనములు బోధిస్తాయి. తర్కము మరియు విజ్ఞానము ఈ పద్ధతులను వివేచించుటకు దేవుడు మనకిచ్చిన వరములైయున్నాయి. ఈ కారణం చేత, ఇవాంజెలికల్ క్రైస్తవులు పంచగ్రంథము యొక్క తార్కిక మరియు వైజ్ఞానిక పరిశోధనకు విలువనిస్తారు. కాని అదే సమయములో, దేవుడు లోకములో లోకాతీతముగా పాలుపంచుకున్నాడు మరియు పాలుపంచుకొనుచున్నాడు అని యేసు అనుచరులు ఎరిగియున్నారు. దేవుడు సాధారణ ప్రక్రియలు మరియు ప్రాకృతిక కారణములు లేకుండా, వాటిని మించి, లేక వాటికి విరోధముగా కూడా కార్యములు చేయగలడు. ఈ నమ్మకము మన పంచగ్రంథ అధ్యయనము మీద అనేక విధాలుగా ప్రభావము చూపుతుంది. అయితే విశేషముగా, దేవుడు లేఖనముల యొక్క రచనను ప్రేరేపించాడని, పర్యవేక్షించాడని ఇది మనకు నిశ్చయతను ఇస్తుంది. కాబట్టి, అవి ఆయన యొక్క సంపూర్ణ అధికారికము కలిగిన ఆధారయోగ్యమైన లేఖనములైయున్నాయి. అవును, పంచగ్రంథము ఏమి బోధిస్తుందో దానికి భిన్నముగా వ్యాఖ్యానములు చేయకుండా మనము ఎల్లప్పుడూ జాగ్రత్తపడాలి. మన వ్యాఖ్యానములు ఎల్లప్పుడూ అభివృద్ధి చెందుతూ ఉండాలి. అయితే ఇవాంజెలికల్ దృష్టికోణము ప్రకారం, పంచగ్రంథము నిజమని చెప్పు ప్రతిది కూడా నిజమైయున్నది ఎందుకంటే అది దేవుని ద్వారా ప్రేరేపించబడినది.

లోకాతీతవాదమును గూర్చి మనము కలిగియున్న పూర్వభావిత్వములు సూటిగా మనలను ఇశ్రాయేలు విశ్వాసము యొక్క చారిత్రిక పురోగమనములను గూర్చిన పూర్వభావిత్వములలోనికి నడిపిస్తాయి.

## చారిత్రిక పురోగమనము

మనము ఇంతకు ముందు చూసినట్లు, పురాతన పశ్చిమ ఆసియాలో ఉన్న ఇతర మతముల వలెనె ఇశ్రాయేలు విశ్వాసము కూడా ప్రాకృతిక మార్గములలో అభివృద్ధి చెందింది అని ఆధునిక విమర్శనాత్మక పండితులు వాదించారు. అయితే విశేషమైన దైవిక ప్రత్యక్షతల ద్వారా ఇశ్రాయేలు యొక్క విశ్వాసము అభివృద్ధి చెందింది అని ఇవాంజెలికల్ క్రైస్తవులు నమ్ముతారు. వాస్తవానికి దేవుడు ఆదాము, నోవహులతో ఆరంభించి, స్త్రీ పురుషులకు తనను తాను సూటిగా ప్రత్యక్షపరచుకున్నాడు. మరియు ఆయన ఇశ్రాయేలు పితరులైన అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబుతో కూడా మాట్లాడాడు. మండుచున్న పొద యొద్ద ఆయన మోషేతో మాట్లాడాడు. సీనాయి పర్వతము యొద్ద ఆయన ఇశ్రాయేలుకు ధర్మశాస్త్రమును ఇచ్చాడు. ఇట్టి ప్రత్యక్షతలు పురాతన పశ్చిమ ఆసియాలో ఉన్న ఇతర మతముల కంటే భిన్నమైన రీతులలో ఇశ్రాయేలు యొక్క విశ్వాసము అభివృద్ధి చెందుటకు కారణమయ్యాయి. ఖచ్చితముగా, దేవుని సామాన్య కృప మరియు సాతాను యొక్క ప్రభావము ఇశ్రాయేలు విశ్వాసము మరియు ఇతర దేశములలోని మతముల మధ్య పోలికలు ఉత్పన్నమగుటకు కారణమయ్యాయి. అయితే ఇశ్రాయేలు యొక్క విశ్వాసము ప్రాకృతికముగా పురోగతి చెందలేదు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

బదులుగా, పంచగ్రంథము బోధించుచునట్లు దేవుడు ఇశ్రాయేలు ఆరంభ విశ్వాసము యొక్క అభివృద్ధిని లోకాతీతమైన రీతులలో నడిపించాడు.

పంచగ్రంథము యొక్క విమర్శనాత్మక విధానములకు భిన్నముగా ఉన్న ఆధునిక ఇవాంజెలికల్ దృక్పధములను మరియు పూర్వభావిత్వములను మనము చూశాము. ఈ దృక్పధములు పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వమును గూర్చి భిన్నాభిప్రాయములకు దారితీసాయి. పంచగ్రంథము మోషే దినములలో వ్రాయబడినది అను ఆలోచనను విమర్శనాత్మక పండితులు తిరస్కరిస్తారు. అయితే ఇవాంజెలికల్ క్రైస్తవులు మాత్రం పంచగ్రంథము మోషే కాలములో వ్రాయబడినది అను యూదుల మరియు క్రైస్తవుల సాంప్రదాయిక నమ్మకమును ఉద్ఘాటిస్తారు.

## గ్రంథకర్తృత్వము

పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వమును గూర్చి ఇవాంజెలికల్ దృక్పధములను పరీక్షించుటకు, మనము రెండు దిశలలో పరిశీలన చేద్దాము. మొదటిగా, ఈ దృష్టి కోణమునకు బైబిలు ఆధారమును మనము పరిశీలన చేద్దాము. రెండవదిగా, "ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వము" అని పిలువబడుదానిని ఆధునిక ఇవాంజెలికల్ క్రైస్తవులు ఏ విధముగా నమ్ముతారో వివరిద్దాము. మోషే గ్రంథకర్తృత్వమునకు బైబిలు ఆధారమును పరిశీలన చేస్తూ ఆరంభిద్దాము.

### బైబిలు ఆధారము

మోషే పంచగ్రంథము యొక్క రచయిత అను సాంప్రదాయిక అభిప్రాయమునకు కావలసినంత బైబిలు ఆధారము లేఖనములో ఉన్నది. అయితే సమయమును దృష్టిలో ఉంచుకొని, బైబిలులోని మూడు భాగముల నుండి కొన్ని వాక్యభాగములను మాత్రమే మనము చూద్దాము, మరియు క్రొత్త నిబంధనలో ఉన్న ఆధారముతో ఆరంభిద్దాము. లూకా 24:44ను వినండి, అక్కడ యేసు ఇలా సెలవిచ్చాడు:

> మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెను (లూకా. 24:44).

ఇక్కడ యేసు, తన కాలములో నివసించిన యూదుల వలెనె, పాత నిబంధన అంతటిని మూడు విభాగములుగా విభజించాడు. మోషే, ప్రవక్తలు మరియు కీర్తనలు. ఈ విశిష్టతల ద్వారా, యేసు పంచగ్రంథము, లేక తోరాను మోషేకు ఆపాదించాడని లూకా సూటిగా సూచించాడు.

యోహాను 5:46లో కూడా పంచగ్రంథము యొక్క రచయిత మోషే అని యేసు ప్రస్తావించాడు:

> అతడు నన్ను గూర్చి వ్రాసెను గనుక మీరు మోషేను నమ్మినట్టయిన నన్నును నమ్ముదురు (యోహాను 5:46).

యేసు స్వయంగా ఇచ్చిన సాక్ష్యముతో పాటుగా, పంచగ్రంథములోని పలు భాగములను మోషే వ్రాసినట్లు క్రొత్త నిబంధనలోని ఇతర వాక్యభాగములు తెలియజేస్తున్నాయి. మార్కు 7:10, యోహాను 7:19, రోమా. 10:5, మరియు 1 కొరింథీ. 9:9లో వీటిని మనము చూస్తాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వాస్తవానికి, మోషే గ్రంథకర్తృత్వమునకు క్రొత్త నిబంధన ఇచ్చు మద్దతు పాత నిబంధన యొక్క సాక్ష్యము మీద ఆధారపడియుంటుంది. మరియు అనేక సందర్భాలలో, పాత నిబంధనలోని పుస్తకములు పంచగ్రంథమును మోషేకు ఆపాదించాయి. ఉదాహరణకు, 2 దిన. 25:4ను వినండి:

> [అమజ్యా] మోషే గ్రంథమందలి ధర్మశాస్త్రమునందు వ్రాయబడియున్న యెహోవా ఆజ్ఞనుబట్టి [చేసెను] (2 దిన. 25:4).

2 దిన. 35:12; ఎజ్రా 3:2 మరియు 6:18; మరియు నెహెమ్యా 8:1 మరియు 13:1 వంటి ఇతర పాత నిబంధన వాక్యభాగములు కూడా పంచగ్రంథమును మోషేకు ఆపాదిస్తాయి.

క్రొత్త నిబంధన మరియు పాత నిబంధన యొక్క సాక్ష్యము సాధారణంగా దాని రచయితను గూర్చి పంచగ్రంథము స్వయంగా ఇచ్చు సాక్ష్యము మీద ఆధారపడియున్నదని మనము గుర్తించాలి. ఖచ్చితముగా మాట్లాడితే, పంచగ్రంథము చాలా వరకు అనామధేయముగా ఉన్నది. ద్వితీయోపదేశకాండములోని మొదటి వచనము మినహా, మోషే యొక్క గ్రంథకర్తృత్వమును సూచించు విధముగా ఏ పుస్తకము యొక్క ఆరంభములోను, ముగింపులోను అతని పేరు ఇవ్వబడలేదు. అయితే పురాతన పశ్చిమ ఆసియాలో ఇది ఒక అసాధారణమైన విషయము ఏమి కాదు. లేఖనములలో కూడా ఇది ఒక అసాధారణమైన విషయము కాదు. వాస్తవానికి, మోషే దేవుని యొద్ద నుండి ప్రత్యక్షతలను పొందాడని మరియు అతడు పంచగ్రంథమును సంకలనము చేశాడని నిరూపించుటకు పంచగ్రంథము స్పష్టమైన కథనములను చేస్తుంది. ఉదాహరణకు, నిర్గమ. 20:18-23:33లో ఉన్న నిబంధన గ్రంథమును మోషే వ్రాశాడని నిర్గమ. 24:4 మనకు తెలియజేస్తుంది. లేవీయకాండములో ఉన్న నియమములు ఇశ్రాయేలుకు మోషే ద్వారా ఇవ్వబడినవని లేవీ. 1:1-2లో మనము నేర్చుకుంటాము. ద్వితీయోపదేశకాండములో ఉన్న ఉపన్యాసములను మోషే ఇచ్చాడని ద్వితీ. 31:1 మరియు 32:44 మనకు తెలియజేస్తాయి. సారాంశముగా, పంచగ్రంథములో ఉన్న ముఖ్యమైన భాగములన్నిటిని పొందుకొనుటలో మరియు తరువాత తరములకు అందించుటలో మోషే కీలకమైన పాత్ర పోషించాడని పంచగ్రంథము స్పష్టముగా తెలియజేస్తుంది.

పంచగ్రంథము యొక్క గ్రంథకర్తృత్వమును గూర్చి విమర్శనాత్మక ఆలోచనలకు విరోధముగా ఇవాంజెలికల్ క్రైస్తవులు ఎందుకు నిలబడ్డారో ఇవి మరియు ఇతర బైబిలు ఆధారములు వివరిస్తాయి. స్పష్టముగా, పంచగ్రంథము మోషే జీవిత కాలమునకు అనేక సంవత్సరముల తరువాత వ్రాయబడినది అని ఊహించు విమర్శనాత్మక పునర్నిర్మాణములను లేఖనము సమర్థించదు. పాత మరియు క్రొత్త నిబంధన యొక్క సాక్ష్యమును మనము అనుసరించినట్లయితే, పంచగ్రంథమునకు మోషేకు మధ్య ఉన్న సంబంధమును గూర్చి మనము నిశ్చయతను కలిగియుండవచ్చు.

> పంచగ్రంథము మోషేకు చెందినది అని స్వయంగా పంచగ్రంథము తెలియజేస్తుంది. నిర్గమకాండము నుండి ద్వితీయోపదేశకాండము వరకు మోషే స్వయంగా ఒక ప్రధానమైన పాత్రగా ఉన్నాడు. మరియు వాక్యభాగము స్వయంగా చాలా వరకు మోషే కాలములో వ్రాయబడినదిగా ఉన్నది. ఉదాహరణకు, నిర్గమ. 21 నుండి 23లో ఉన్న నిబంధన గ్రంథమును వ్రాయమని యెహోవా మోషేకు ఆజ్ఞ ఇచ్చినట్లు నిర్గమకాండము సెలవిస్తుంది. మోషే ఇచ్చిన ఉపన్యాసము మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> ధర్మశాస్త్రముల క్రమమును మనము పొందుకున్నామని లేవీయకాండములో వ్రాయబడినది. సంఖ్యాకాండములో కూడా మోషే ప్రధానమైన పాత్రగా ఉన్నాడు. ద్వితీయోపదేశకాండములో మోషే ఇచ్చిన పలు ఉపన్యాసములను మనము చూస్తాము, మరియు మోషే స్వయంగా ఈ భాగమును వ్రాసి యాజకులకు అందించాడని ద్వితీయోపదేశకాండములో అనేకచోట్ల ప్రస్తావించబడింది. ఇప్పుడు, ద్వితీయోపదేశకాండము అంతా మోషే వ్రాశాడని మాత్రం దీని అర్థము కాదుగాని, గ్రంథములోని ఎక్కువ భాగమును, పుస్తకములోని ఎక్కువ శాతమును, మోషే వ్రాసి యాజకులకు అప్పగించాడని ద్వితీయోపదేశకాండము స్వయంగా సెలవిస్తుంది. కాబట్టి, ఉదాహరణకు, ద్వితీయోపదేశకాండములో, మోషే చివరి భాగముల రచయిత కావొచ్చు కాకపోవచ్చుగాని గ్రంథములోని తొంబై శాతము మోషే వ్రాసియుండవచ్చు.
>
> — డా. గోర్డన్ హెచ్. జాన్సన్

మోషే గ్రంథకర్తృత్వముకు బైబిలు ఆధారము మద్దతునిస్తుంది అని చూశాము కాబట్టి, ఇప్పుడు రెండవ విషయమును మనము చూడవలసియున్నది. ఇవాంజెలికల్ క్రైస్తవులు ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వము అని చెప్పినప్పుడు దాని యొక్క అర్థము ఏమిటి?

## ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వము

పంచగ్రంథము మీద విమర్శనాత్మక అభిప్రాయములకు ఇవాంజెలికల్ క్రైస్తవులు స్పందిస్తూ, అనేక విధాలుగా వారు తమ ప్రతిస్పందనలను పరిష్కృతము చేశారు. అయితే ఇరవైయ్యవ శతాబ్దము చివరి నాటికి, పంచగ్రంథము "ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వమైయున్నది" అని మాట్లాడుట సర్వసాధారణమైపోయింది.

1949లో తాను వ్రాసిన *ఇంట్రడక్షన్ టు ది ఓల్డ్ టెస్టమెంట్* లో ఎడ్వర్డ్ జే. యంగ్ ఈ దృక్పధమును క్రోడీకరించిన విధానమును వినండి:

> పంచగ్రంథమును మోషే వ్రాశాడని మనము ఉద్ఘాటించినప్పుడు... ప్రతి పదమును అతడే వ్రాశాడు అని మన ఉద్దేశము కాదు... ఇంతకు ముందే ఉనికిలో ఉన్న కొన్ని వ్రాయబడిన ప్రతులను కూడా [అతడు ఉపయోగించియుండవచ్చు]. అంతేగాక, దైవిక ప్రేరణలో, తరువాత దానిలో కొన్ని విషయములు చేర్చబడియుండవచ్చు మరియు కొన్ని సవరణలు కూడా జరిగియుండవచ్చు. ఏది ఏమైనా, ఇది ప్రధానముగా మరియు చాలా వరకు మోషే యొక్క ఉత్పత్తి అయ్యున్నది.

ఇప్పుడు, మోషే గ్రంథకర్తృత్వము మీద ఈ దృక్పధమును ఇవాంజెలికల్ క్రైస్తవులు అనేక విధాలుగా అర్థము చేసుకున్నారు. అయితే కొంత వరకు, మనము ఎల్లప్పుడు మనస్సులో ఉంచుకొనవలసిన మూడు విషయములను గుర్తుచేసుకొనుటకు మనము "ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వము" అను విషయమును గూర్చి మాట్లాడతాము: మోషే ఉపయోగించిన మూలములు,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పంచగ్రంథము వ్రాయబడిన ప్రక్రియ, మరియు మోషే దినముల తరువాత పంచగ్రంథములో జరిగిన సవరణలు. మోషే ఉపయోగించిన మూలములను మొదట చూద్దాము.

**మూలములు.** దేవుడు తనను తాను మోషేకు అనేక విధాలుగా బయలుపరచుకున్నాడని లేఖనములు బోధిస్తాయి. ఉదాహరణకు, దేవుడు తన వ్రేలితో స్వయంగా పది ఆజ్ఞలను వ్రాశాడు. మరియు నిబంధన గ్రంథములో సీనాయి పర్వతము యొద్ద దేవుడు మోషేకు ఇచ్చిన ఆజ్ఞలు ఉన్నాయి. అయితే, లేఖనములోని అనేక ఇతర భాగముల వలెనె, పంచగ్రంథమును వ్రాయుచుండగా మోషే ఇతర మూలములను కూడా ఉపయోగించాడు అనుటకు సూచనలు ఉన్నాయి.

ఒక వైపున, అతడు అనేక రకముల మౌఖిక పరంపరలను ఉపయోగించియుంటాడు. ఉదాహరణకు, మోషే బాల్యములో తనకు జన్మనిచ్చిన తల్లి యొద్ద మరియు మిగిలిన కుటుంబీకుల యొద్ద కొన్ని విషయములను నేర్చుకొనియుండవచ్చు. అంతేగాక, తన మామయైన మిద్యానీయుడైన యిత్రో ఇచ్చిన సలహాను మోషే స్వీకరించాడు అని నిర్గమ. 18:17-24లో మనము చూస్తాము.

> పంచగ్రంథము, ప్రాచీన చరిత్ర లేక మరొక భాగము వెనుక ఉన్న మౌఖిక పరంపరలను గూర్చి మనము మాట్లాడు ప్రతిసారి, అది అస్పష్టముగా ఉంటుంది ఎందుకంటే దానికి స్థిరమైన ఆధారము లేదు. అందుకనే "మౌఖిక" అని చెప్పినప్పుడు, ఏది కూడా వ్రాయబడిలేదు అని దాని అర్థము. కాని దానిని గూర్చి మీరు ఒక్క నిమిషం ఆలోచన చేస్తే, మోషే ఒక రోజున లేచి ఈ కథలను గూర్చి ఊరకే ఆలోచన చేసి కల్పించలేదని, మరియు ఎలాంటి మౌఖిక నేపథ్యము లేకుండా దేవుడు ఒక దినాన మోషేకు ఈ కథలను గూర్చి చెప్పలేదని మనకు గ్రహింపును కలుగజేయు కొన్ని విషయములను మనము తెలుసుకుంటాము. ప్రాచీన సంస్కృతులు నేటికి కూడా చాలా వరకు కథల మీద, తమ ప్రజలను గూర్చిన పురాతనమైన కథలను ఒక తరము నుండి మరొక తరమునకు మౌఖికముగా అప్పగించుట మీద ఆధారపడతాయి అను వాస్తవము ఒక రుజువైయున్నది, మరియు బైబిలు కాలములో కూడా ప్రజలు ఇలానే చేశారని పోల్చుటకు ఇది ఉపయోగించబడుతుంది. నిర్గమకాండము మరియు సంఖ్యాకాండములో కనిపించు వృత్తాంతములు ద్వితీయోపదేశకాండములో పునరావృతమైన విధానము పంచగ్రంథములో దీనికి ఒక బలమైన రుజువుగా ఉన్నది. మరియు ద్వితీయోపదేశకాండములో, మోషే ఉపన్యాసములను లేక ప్రసంగములను ఇచ్చు నేపథ్యములు మనకు ఇవ్వబడినవి, మరియు వీటిలో నిర్గమకాండము మరియు సంఖ్యాకాండములో మనకు కనిపించు విషయములు కూడా ఉన్నాయి. అవి కొన్ని పోలికలను కలిగియున్నప్పటికీ, అవి ఒకే విధంగా మాత్రం లేవు అనునది ఒక ఆసక్తికరమైన విషయము. కాబట్టి, మోషే దినములలో ఒక సంస్కృతి ఉండేది, ఆ రోజులలో ఇశ్రాయేలులో ఒక సంస్కృతి ఉండేది, అది మునుపటి కాలములోని వృత్తాంతములను లేక కథలను తీసుకొని, మునుపటి కాలములో జరిగిన సంగతులను మరియు అవి ఒక తరము నుండి మరొక తరమునకు అందించబడిన విధానము తీసుకొని మీరు జీవించుచున్న సంస్కృతిలో

> కొన్ని విధములుగా వాటిని ఉపయోగించుట. మరియు, మోషే తన బాల్యములో కొంత కాలము తన తల్లి గృహములో నివసించిన విషయం మీకు తెలుసు, మరియు దీని ద్వారా అతడు తన పూర్వీకులను గూర్చి కొన్ని వృత్తాంతములను నేర్చుకొనుటకు, హెబ్రీయునిగా తన గుర్తింపును కనుగొనుటకు, అబ్రాహాము వారసునిగా తన గుర్తింపును గూర్చి తెలుసుకొనుటకు అవకాశం ఇచ్చియుంటుంది. మరియు, మోషే ఇశ్రాయేలు యొక్క పెద్దలతో మాట్లాడుచుండగా, యిత్రో దగ్గర నుండి తిరిగివచ్చిన తరువాత కూడా, తన పూర్వీకులను గూర్చి అనేక వృత్తాంతములను అతడు నేర్చుకొనియుంటాడు. ఈ విధంగా, మోషే పంచగ్రంథములోని పలు భాగములను గూర్చి వ్రాయుచుండగా మౌఖిక పరంపరల మీద, లేక ఒక తరము నుండి మరొక తరమునకు అందించబడిన వృత్తాంతముల మీద ఆధారపడ్డాడు అనుటకు మంచి కారణము ఉంది.
>
> — డా. రిచర్డ్ ఎల్. ప్రాట్, జూ.

మౌఖిక పరంపరల యొక్క ప్రభావము మండుచున్న పొద యొద్ద మోషే యొక్క పిలుపులోని ఒక విశేషమైన విషయమును వివరిస్తుంది. నిర్గమ. 3:13, 16లో ఏమి జరిగినదో వినండి:

> మోషే చిత్తగించుము, నేను ఇశ్రాయేలీయుల యొద్దకు వెళ్లి వారిని చూచి మీ పితరుల దేవుడు మీ యొద్దకు నన్ను పంపెనని వారితో చెప్పగా వారు ఆయన పేరేమి అని అడిగిన యెడల వారితో నేనేమి చెప్పవలెనని దేవుని నడిగెను....అందుకు దేవుడు ... మీ పితరుల దేవుడైన యెహోవా, అనగా అబ్రాహాము ఇస్సాకు యాకోబుల దేవుడు, నాకు ప్రత్యక్షమై యిట్లనెను నేను మిమ్మును, ఐగుప్తులో మీకు సంభవించిన దానిని, నిశ్చయముగా చూచితిని (నిర్గమ 3:13, 16).

తనను "యెహోవా" — లేక *యాహ్వె* — అనగా అబ్రాహాము ఇస్సాకు యాకోబుల దేవుడు అని సంబోధించమని దేవుడు మోషేకు చెప్పాడు. *యాహ్వె* అను దేవుని నామమును గూర్చి మరియు పితరుల యొక్క పరంపరలను గూర్చి ఎవరో ఒకరు మోషేకు బోధించియుంటారు. లేకపోతే, దేవుడు చెప్పిన మాట మోషే మదిలో లెక్కలేనన్ని ప్రశ్నలను కలిగించియుండేది. కాని, ఇక్కడ మనము చూస్తున్నట్లు, దేవుని ఆజ్ఞను పొందుకొనుటకు మోషే ఎంతగా సిద్ధపడ్డాడంటే, దీనిని గూర్చి అతడు ఎలాంటి ప్రశ్నను అడుగలేదు.

మోషే పంచగ్రంథమును వ్రాసినప్పుడు అతడు స్వతంత్ర ప్రతులను కూడా మూలములుగా ఉపయోగించాడు అను నిశ్చయతను మనము కలిగియుండవచ్చు. నిర్గమ. 24:7 వంటి చోట్ల మనము దీనిని చూస్తాము. ఒక స్వతంత్ర ప్రతుగా మోషే "నిబంధన పుస్తకము"ను వ్రాసి తరువాత దానిని నిర్గమకాండములో జోడించాడని ఈ వచనము సూచిస్తుంది. మరియు సంఖ్యా. 21:14-15లో, "యెహోవా

చేసిన యుద్ధముల గ్రంథము" అను అప్పటికే ఉనికిలో ఉన్న భౌగోళిక విషయములను మోషే ఉద్ధరణముగా చెప్పాడు.

దీనితో పాటు, ఆది. 5:1లో, "ఆదాము వంశావళి గ్రంథము" అని పిలువబడు ఒక బాహ్య సాహిత్య మూలము ఉన్నదనుటకు ఒక స్పష్టమైన ఆధారము ఉన్నది. ఈ సాహిత్య అనువాదము సూచించుచున్నట్లు, మోషే ఆదాము వారసులను గూర్చి తాను ఒక వాస్తవిక "పుస్తకము" లేక "కాగితపు చుట్ట" — ספר (సెఫెర్) — నుండి పొందుకున్న సమాచారమును సంబోధిస్తున్నాడు.

అంతేగాక, నిర్గమ. 17:14 యుద్ధమును గూర్చిన నివేదికను సూచిస్తుంది. ఈ వచనములో, దేవుడు మోషేకు ఆజ్ఞాపించాడు:

> జ్ఞాపకార్థముగా గ్రంథములో దీని వ్రాసి యెహోషువకు వినిపించుము (నిర్గమ. 17:14).

మోషే పంచగ్రంథమును పూర్తిగా వ్రాయుటకు ముందు కనీసం కొన్ని సన్నివేశములైన స్వతంత్రముగా నమోదు చేశాడని దేవుడు మోషేకు ఇచ్చిన ఆజ్ఞ సూచిస్తుంది.

> మీరు పంచగ్రంథమును, ముఖ్యముగా ఆదికాండమును చూసినప్పుడు, మోషే దానిలో చాలా పురాతనమైన ప్రతులను చేర్చుచున్నాడని మనకు కనిపిస్తుంది. వాస్తవానికి, మోషేకు నాలుగు భాషలు వచ్చియుండవచ్చని మనకు తెలుసు. మోషేకు ఐగుప్తు భాష వచ్చు. అతడు హెబ్రీయుల కుటుంబములో ఎదిగాడు గనుక అతనికి హెబ్రీ భాష కూడా వచ్చు; అతని తల్లి స్వయంగా అతనికి దాదిగా పని చేసింది. ఆ దినములలో సామన్య భాషయైన, అంతర్జాతీయ వ్యాపారము మరియు రాయబారులు మాట్లాడు భాషయైన అక్కదియ భాష కూడా తెలిసినవాడైయుంటాడని మనకు తెలుసు. ఇశ్రాయేలీయులు — అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మరియు మొదలగువారు — ఆరంభ దినములలో మాట్లాడిన భాషయైన అరమాయిక్ భాషను కూడా అతడు మాట్లాడియుంటాడు. కాబట్టి, మోషే మంచి తర్ఫీదు పొందిన, మంచి-విద్యనభ్యసించిన వ్యక్తి, మరియు అతడు ఆదికాండము గ్రంథమును నిర్మించిన విధానములో నుండి కొన్ని ఇతర ప్రతులు ఉపయోగించుచున్నాడని తెలుస్తుంది, ఎందుకంటే అతడు పది సార్లు "ఇవి... వారి వంశములు" లేక "ఇవి... వారి వృత్తాంతములు" మొదలగు మాటలను వ్రాస్తున్నాడు. మరియు ఆ వృత్తాంతములు అతనికి అందుబాటులో ఉండినవని, అతడు వాటిని భద్రపరిచాడని, అతడు వాటిని అనువదించాడని, అరమాయిక్, లేక ఇతర ఆదిమ కనానీయుల భాష వంటి ఏదో ఒక వాస్తవిక భాషలో నుండి తాను ఆదికాండమును వ్రాయుచున్న ప్రజల కొరకు హెబ్రీ భాషలోనికి అనువదించాడని ప్రత్యక్షమవుతుంది. ఆదికాండము తరువాత ఇలా జరిగియుండకపోవచ్చు. మీరు లేవీయకాండము మరియు సంఖ్యాకాండమును, నిశ్చయముగా నిర్గమకాండము మరియు ద్వితీయోపదేశకాండమును చూసినప్పుడు, పంచగ్రంథములోని చివరి నాలుగు పుస్తకములను మీరు చూసినప్పుడు, మోషే వాటిని ప్రత్యక్షముగా ప్రజల

> **మధ్యలో ఉండి వ్రాస్తున్నాడు. అతడు అక్కడే ఉన్నాడు; అతడు దానిని దగ్గరుండి వ్రాస్తున్నాడు. దీనికంటే ముఖ్యముగా, దేవుడు దానిని జరిగించుచున్నాడు, ఎందుకంటే ఆ పుస్తకములు ప్రవక్త ద్వారా ఇవ్వబడిన దేవుని మాటలు.**
>
> — డా. డగ్లస్ స్టువార్ట్

పంచగ్రంథము యొక్క మౌఖిక మరియు సాహిత్య మూలములను గుర్తించుటతో పాటుగా, ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వమును గూర్చి మాట్లాడునప్పుడు పంచగ్రంథము ఒక క్లిష్టమైన ప్రక్రియ ద్వారా వ్రాయబడినది అని కూడా ఇవాంజెలికల్ క్రైస్తవులు గుర్తిస్తారు.

**ప్రక్రియ.** ఆరంభించుటకు, పంచగ్రంథము వ్రాయబడుటకు ముందు మోషే దానిని మౌఖిక ఉచ్చరణ ద్వారా ప్రజలకు అందించాడు. నిర్గమకాండము మరియు ద్వితీయోపదేశకాండములో అతడు ఇచ్చిన ఉపన్యాసములు దీనికి స్పష్టమైన ఉదాహరణలుగా ఉన్నాయి. పంచగ్రంథములోని ఇతర భాగములు కూడా ఇశ్రాయేలుకు మొదటిగా మౌఖికముగా అందించబడి తరువాత వ్రాయబడియుండవచ్చు.

పంచగ్రంథమును వ్రాయుటకు మోషే లేఖకులు లేక శాస్త్రుల సహాయము కూడా తీసుకొనియుండవచ్చు. మోషే ఐగుప్తు న్యాయాలయములలో విద్యనభ్యసించాడని మనకు తెలుసు. కాబట్టి, అధికారిక ప్రతులను వ్రాయుటకు లేఖకులను లేక శాస్త్రులను ఉపయోగించు స్థిరమైన ఆచారమును గూర్చి మోషే యెరిగియుండే ఉంటాడు. ఇశ్రాయేలుకు నాయకునిగా, పంచగ్రంథములో చాలా వరకు లేక మొత్తము తన పర్యవేక్షణలో వ్రాయుటకు మోషే లేఖకులకు ఆజ్ఞ ఇచ్చియుంటాడు.

ఇతర ప్రేరిత బైబిలు రచయితలు కూడా లేఖకులను ఉపయోగించారు అని లేఖనము స్పష్టముగా చెబుతుంది. ఉదాహరణకు, యిర్మీయా 36:4లో, తాను పలుకు మాటలను వ్రాయమని యిర్మీయా తన శిష్యుడైన బారూకుకు స్పష్టముగా ఆజ్ఞాపించాడు.

పంచగ్రంథము యొక్క అసమానంగా ఉన్న సాహిత్య శైలులలో ఈ ఆచారము యొక్క రుజువును మనము చూస్తాము. ఉదాహరణకు, ఆదికాండములోని పలు భాగములలో ప్రత్యక్షమయ్యే కథన శైలులు ఒకదానికొకటి భిన్నముగా ఉన్నాయి. మరియు ద్వితీయోపదేశకాండములో ఉన్న నియమ రూపకమైన మరియు పునరావృతమగు హెబ్రీ భాషకు మరియు పంచగ్రంథములో ఉన్న ఇతర పుస్తకములకు మధ్యన విశేషమైన భిన్నత్వములను మనము చూస్తాము. ఇట్టి వైరుధ్యములు నిశ్చయముగా పలువురు లేఖకులు ఉండుటను సూచిస్తాయి.

ప్రధానముగా మోషే గ్రంథకర్తృత్వము కేవలం మోషే ఉపయోగించిన మూలములు మరియు ప్రక్రియను గూర్చినది మాత్రమే కాదుగాని, మోషే కాలము తరువాత పంచగ్రంథములో చేసిన సవరణలను గూర్చినదిగా కూడా ఉన్నది.

**సవరణ.** ఇంతకు ముందు మనము చూసినట్లు, ఇశ్రాయేలు చెర నుండి తిరిగివచ్చిన తరువాత పంచగ్రంథము దాని యొక్క ఆఖరు రూపమును సంతరించుకున్నదని విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు నమ్మారు. అయితే పంచగ్రంథము మోషే కాలములో వ్రాయబడినదని ఇవాంజెలికల్ క్రైస్తవులు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నమ్ముతారు. అయినను, మోషే దినముల తరువాత సంపాదకుల సవరణను సూచించు కొన్ని భాగములు పంచగ్రంథములో ఉన్నాయి.

ఇప్పుడు, పంచగగ్రంథములోని కొన్ని భాగములకు తేదీలను నిర్ధారించునప్పుడు మనము జాగ్రత్త వహించాలి. ఉదాహరణకు, "ఫిలిష్తీయులు" అని ప్రస్తావించు ప్రతి వాక్య భాగము మోషే దినముల తరువాత వ్రాయబడియుండవచ్చని కొందరు వ్యాఖ్యానకర్తలు సూచిస్తారు. అయితే ఈ దృష్టికోణం మూడు కారణముల వలన నమ్మశక్యముగా లేదు. మొదటిగా, ఆ ప్రదేశములో ఫిలిష్తీయులు నివసించుటను గూర్చి పురావస్తుశాస్త్ర సమాచారము వివాదాస్పదముగా ఉన్నది. రెండవదిగా, మోషే "ఫిలిష్తీ" (అనగా "యాత్రికుడు") అను పదమును సామాజిక బిరుదుగా ఉపయోగించియుంటాడు. మరియు మూడవదిగా, "ఫిలిష్తీ" అను పదము మోషే దినములలోని ప్రజలకు తెలియనప్పటికీ, మోషే దినముల తరువాత శ్రోతల కొరకు "ఫిలిష్తీ" అను పదమును మాత్రమే సవరించియుండిన అవకాశం కూడా ఉంది.

అదే విధముగా, ఆది. 36:31-43లో ఇవ్వబడిన ఎదోమీయుల రాజుల పట్టిక మోషే కాలమును మించినదిగా ఉన్నదని వ్యాఖ్యానకర్తలు వాదిస్తారు. అయితే ఆదికాండములో ఇవ్వబడిన ఎదోము నాయకుల పట్టిక యొక్క గుర్తింపు నిశ్చయతగలదిగా లేదు. మరియు ఈ వాక్యభాగములలో మోషే కాలము తరువాత చేయబడిన సూక్ష్మ సవరణలు ఉన్నాయనుటకు అవకాశం కూడా ఉంది.

పంచగ్రంథములో సూక్ష్మ సవరణకు ఒక ఉదాహరణ ఆదికాండము 14:44లో స్పష్టముగా ఇవ్వబడింది. అక్కడ మనము ఇలా చదువుతాము:

> **అబ్రాము తన తమ్ముడు చెరపట్టబడెనని విని తన యింట పుట్టి అలవరచబడిన మూడువందల పదునెనమండుగురిని వెంటబెట్టుకొని దానుమట్టుకు ఆ రాజులను తరిమెను (ఆది. 14:14).**

అబ్రాహాము తన విరోధులను "దాను మట్టుకు" తరిమెను అని ఈ వాక్యభాగము సెలవిస్తుంది. అయితే యెహోషువ దినముల వరకు ఈ ఉత్తర ప్రాంతమునకు దాను అని పేరు పెట్టబడలేదు అని యెహోషువ 19:47లో మనము నేర్చుకుంటాము. కాబట్టి, ఆది. 14:14 సవరించబడిన స్థలము పేరును ప్రతిబింబిస్తుంది అని లేఖనము స్వయంగా సూచిస్తుంది. ఇట్టి ఆధునీకరణ తరువాతి పాఠకులకు తాము ఎరిగిన భౌగోళిక స్థలముతో అబ్రాహామును గూర్చిన వృత్తాంతమును అనుసంధానము చేసుకొనుటకు సహాయము చేశాయి. పంచగ్రంథములోని ఇతర వాక్యభాగములు కూడా ఇదే విధముగా సవరించబడియుండవచ్చు.

పంచగ్రంథములో కనిపించు సుపరిచితమైన మరియు అత్యంత ప్రాముఖ్యమైన సవరణ ద్వితీయోపదేశకాండము 34లో ఉన్న మోషే మరణమును గూర్చిన నివేదికలో కనిపిస్తుంది. అయితే ఇక్కడ కూడా, ఇశ్రాయేలుకు ధర్మశాస్త్రమును ఇచ్చిన వ్యక్తికి ఏమైనదో వివరించుటకు ఒక చిన్న అనుబంధము మాత్రమే ఇవ్వబడినది.

ఇలాంటి చిన్న చిన్న సవరణలతో పాటుగా, హెబ్రీ భాష అభివృద్ధి పొందిన కొలది పంచగ్రంథము యొక్క భాష కూడా సవరించబడింది. "ప్రోటో-హెబ్రీ" అని పండితులు పిలచు భాషలో మోషే వ్రాశాడని ఆధునిక పరిశోధన బలముగా సూచిస్తుంది. మోషే దినములలో ఉపయోగించిన కనానీయుల ఉపభాషలకు ఇలాంటి హెబ్రీ భాషకు దగ్గర సంబంధము కలిగియున్నట్లు ఐగుప్తులో దొరికిన "అమర్న



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

లేఖలు" అను అంతర్జాతీయ ప్రతులలో కనిపించిన రుజువు సూచిస్తుంది. కాని ఈ భాష సంప్రదాయిక హెబ్రీ భాషలో ఉన్న పంచగ్రంథములో మనము కనుగొను భాష కంటే మునుపటిదిగా ఉన్నది.

> పాత నిబంధనలోని భాషను గూర్చిన ప్రశ్న చాలా ఆసక్తికరమైనది. ఈ భాష ఎప్పటిది మరియు ఎక్కడ నుండి వచ్చింది? అది ఎక్కడ నుండి వెలువడింది? ఇది ప్రజలను చాలా కాలము వరకు కలవరమునకు గురి చేసింది, ఎందుకంటే పురావస్తుశాస్త్ర పరిశోధనలలో అసలు హెబ్రీ రచన, పురాతన హెబ్రీ భాష ఉన్నది అని రుజువు ఉందా? ఈ మధ్య కాలములో ఇరవైయ్యవ శతాబ్దములో త్రవ్విన కొన్ని లేఖనభాగ ప్రతులు అందుబాటులో ఉన్నాయి. మరియు, అవన్నీ తరువాత కాలమునకు చెందినవి. అవి మోషే కాలమునకు తరువాత వచ్చినవి... కాబట్టి, వాటితో మనము ఏమి చేయగలము? సరే, క్రీ.పూ పదమూడు మరియు పద్నాలుగు శతాబ్దములలో దౌత్య సంబంధములు ఉండేవి అనుటకు రుజువు ఉన్నది, ఇవి ఇశ్రాయేలు భూమి అయిన కనానులో — ఇది తరువాత ఇశ్రాయేలీయుల దేశమైయ్యింది — వెలికి తీయబడలేదుగాని, ఐగుప్తులో వెలికితీయబడినవి... అది మెసొపొతమియలో ఆరంభమైన అక్కదీయుల భాషలో వ్రాయబడినది, మరియు అది లింగ్వా ఫ్రాంకా, అనగా ఆ దినముల యొక్క అంతర్జాతీయ దౌత్య సంబంధములకు ఉపయోగించిన భాషగా ఉన్నది. అయితే కనానీయులు ఉండేవారు, ఐగుప్తు నాయకుల యొక్క లేఖకులు ఉండేవారు, మరియు వారికి మార్జిన్లో వ్రాయబడిన కొన్ని మార్జిన్ నోట్స్ కూడా ఉండేవి, మరియు ఇవి కనానీయ భాషలో వ్రాయబడేవి. కాబట్టి అది మన సంబంధము. కనానీయుల భాష మనలను మోషే దినములలోని హెబ్రీ భాషతో కలుపుతుంది. ఇప్పుడు, మన యొద్ద ఎలాంటి నివేదిక లేదు, మోషే కాలములో మాట్లాడిన హెబ్రీ భాషలో నుండి ఇప్పుడు మిగిలియున్నది ఏమి లేదు, కాని అది మనకు అనుబంధముగాను, వంతెనగాను ఉన్నది. కాబట్టి, చెరకు ముందు ఉన్న హెబ్రీ భాష మరియు చెర తరువాత ఉన్న హెబ్రీ భాషలో వ్రాయబడిన మరియు మనము ప్రామాణిక బైబిలు హెబ్రీ భాష అని పరిగణించు భాష కనానీయుల మార్జిన్ నోట్స్ లో నుండి వెలువడుతుంది మరియు కనానీయుల భాష మోషే కాలములోని హెబ్రీ భాషతో సంబంధము కలిగియున్నది. కాబట్టి, ఇది మన సంబంధం. ఇది పరోక్షమైనది, కాని నిజమైనది, మరియు ప్రాముఖ్యమైనది.
>
> — డా. టామ్ పెట్టర్

ఇశ్రాయేలును రాజులు పాలించిన కాలములో, క్రీ.పూ. 1000 నుండి క్రీ.పూ. 600 మధ్య కాలములో, "పాత" లేక "పాలెయో-హెబ్రీ" అని పిలువబడు భాష అభివృద్ధి చెందింది. పంచగ్రంథములోని కొన్ని భాగములు, నిర్గమకాండము 15 మరియు ద్వితీయోపదేశకాండము 32 అధ్యాయములు వంటివి, హెబ్రీ భాష యొక్క ఈ స్థాయిని పోలియున్నవని అనేక పండితులు ఒప్పుకుంటారు.

కాని పంచగ్రంథములోని అధిక శాతము ఇప్పుడు మనము "క్లాసికల్ హెబ్రీ" అని పిలుచు భాష యొక్క పదములు, అక్షరములు మరియు వ్యాకరణమునకు దగ్గర పోలిక కలిగియున్నది. క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దము యొక్క మధ్య భాగము నుండి ఆరవ శతాబ్దము యొక్క ఆరంభ భాగముల వరకు హెబ్రీ భాష అభివృద్ధి చెందినది.

ఈ ఆధారము ద్వారా, మోషే స్వయంగా ఉపయోగించిన ప్రోటో-హెబ్రీ పాలెయో-హెబ్రీగా నవీకరించబడినట్లు అనిపిస్తుంది. తరువాత ఇది నేడు హెబ్రీ బైబిలులో ఉన్న క్లాసికల్ హెబ్రీగా నవీకరించబడింది.

యేసు, ఆయన అపొస్తలులు మరియు ప్రవక్తల దినములలో, పంచగ్రంథములోని హెబ్రీ భాష ఇలాంటి మార్పులన్నిటిని ఎదుర్కొన్నదని జ్ఞాపకముంచుకొనుట చాలా అవసరము. కాని ఈ వాస్తవము తమ దినములలోని పంచగ్రంథమును మోషే వ్రాశాడు అను విషయమును యేసు మరియు ఆయన అనుచరులు నిరాకరించునట్లు చేయలేదు. కాబట్టి, నేటి క్రీస్తు అనుచరులముగా, నేడు మనము కలిగియున్న పంచగ్రంథము నమ్మకముగా మోషే యొక్క వాస్తవిక రచనలకు ప్రాతినిధ్యం వహిస్తుంది అను నిశ్చయతను కలిగియుండవచ్చు.

ఇప్పటి వరకు, మనము ఆధునిక ఇవాంజెలికల్ దృక్పథములను చూశాము మరియు పంచగ్రంథమును గూర్చి ఇవాంజెలికల్ క్రైస్తవులు కలిగియున్న కొన్ని ప్రాముఖ్యమైన పూర్వభావిత్వములను చూశాము. బైబిలులోని ఈ భాగము యొక్క గ్రంథకర్తృత్వముపై ఇవాంజెలికల్ క్రైస్తవుల అభిప్రాయమును చూశాము. ఇప్పుడు, ఇవాంజెలికల్ క్రైస్తవులు అనుసరించు వ్యాఖ్యాన వ్యూహముల మీద ఈ దృక్పథములు ఎలాంటి ప్రభావమును చూపాయో చూద్దాము.

## వ్యాఖ్యాన వ్యూహములు

ఈ వ్యాఖ్యాన వ్యూహములను వర్ణించుటకు అనేక మార్గములు ఉన్నాయి, కాని ఇవాంజెలికల్ క్రైస్తవులు అనుసరించిన మూడు ముఖ్యమైన దిశలలో మాత్రమే మనము చూద్దాము. మొదటిగా, మనము అంశాత్మక వ్యాఖ్యానమును చూద్దాము. తరువాత చారిత్రిక వ్యాఖ్యానమును పరిగణిద్దాము. మరియు చివరిగా, మనము సాహిత్య వ్యాఖ్యానమును పరిశీలన చేద్దాము. ఈ మూడు వ్యూహములు ఒక దాని మీద ఒకటి అధికముగా ఆధారపడియుంటాయి మరియు ఒకటి లేకుండా మరొకటి పని చేయలేవు. అయితే వాటి ఉద్ఘాటనలు మాత్రం వేరుగా ఉన్నాయి, కాబట్టి అంశాత్మక వ్యాఖ్యానముతో ఆరంభించి వాటిని ఒక్కొక్కటిగా చూచుట సహాయకరముగా ఉంటుంది.

### అంశాత్మక

అంశాత్మక వ్యాఖ్యానములో, మనకు ప్రాముఖ్యమైన విషయములను ప్రతిబింబించు విధముగా మనము పంచగ్రంథమును ఒక అద్దము వలె పట్టుకుంటాము. ఇవాంజెలికల్ క్రైస్తవులు బైబిలులోని ఈ భాగములో ఉన్న కొన్ని విషయములను లేక అంశములను సరిగానే ఉద్ఘాటించారు. అయితే మనము చూడబోవుచున్నట్లుగా, పంచగ్రంథములోని ప్రతి పుస్తకమునకు దానికి మాత్రమే పరిమితమైన కొన్ని ప్రాధాన్యతలు ఉన్నాయి. కాబట్టి, మోషే ఈ అంశములను ఉద్ఘాటించియుండొచ్చు లేక ఉద్ఘాటించియుండకపోవచ్చు. ఈ పద్ధతిని కొన్ని శతాబ్దములుగా క్రైస్తవ వ్యాఖ్యానము అనుసరించింది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

క్రైస్తవులు ఉద్ఘాటించిన అంశముల యొక్క పట్టిక చాలా పెద్దదిగా ఉన్నది. కొందరు వ్యక్తిగత ప్రశ్నలు మరియు ప్రస్తుత వివాదములను ఉద్ఘాటించారు. మరికొందరు సాంప్రదాయిక క్రమబద్ధ వేదాంతశాస్త్రములో ఉన్న అభిప్రాయాలకు మద్దతునిచ్చుటకు పంచగ్రంథమును ఉపయోగించుకున్నారు. ఉదాహరణకు, పంచగ్రంథము దేవుని గూర్చి అనేక విషయములను బయలుపరుస్తుంది. మానవత్వములోని పలు విషయములను చర్చించుట మీద అది చాలా సమయమును వెచ్చిస్తుంది. మరియు మిగిలిన సృష్టి అంతటి మీద అది విశేషమైన శ్రద్ధను పెడుతుంది.

ఇప్పుడు, అంశాత్మక వ్యాఖ్యానములో ఉన్న ఒక పెద్ద బలహీనత ఏమిటంటే, మోషే వాస్తవముగా వ్రాసిన అంశములు వాగ్దాన దేశము వైపుకు తనను వెంబడించుచున్న ఇశ్రాయేలీయుల కొరకు వ్రాయబడినవి అను సత్యమును ఇది పరిగణలోనికి తీసుకోదు. మరియు ఈ యొక్క వాస్తవిక నేపథ్యముపట్ల తక్కువ ఆసక్తి చూపబడుతుంది కాబట్టి, అంశాత్మక వ్యాఖ్యానములు కొన్ని చిన్న అంశముల మీద దృష్టిపెట్టుట మినహా పెద్దగా ఏమి సాధించలేవు.

అయినప్పటికీ, పంచగ్రంథ అధ్యయనమునకు ఈ పద్ధతిని ఉపయోగించుటను క్రొత్త నిబంధన ఆమోదిస్తుంది అను విషయమును మనము మనస్సులో ఉంచుకోవాలి. బైబిలులోని ఈ భాగములో ఉన్న విశ్వాసము ద్వారా నీతి, విడాకులు, విశ్వాసము మరియు కార్యములు మరియు అనేక ఇతర చిన్న చిన్న అంశములను గూర్చి చర్చించునప్పుడు యేసు మరియు క్రొత్త నిబంధన రచయితలు మోషే గ్రంథములను ఉపయోగించారు. కాబట్టి, ఈ అంశములను లేఖనముల మీద రుద్దుటకు మనము ప్రయత్నించనంత వరకు, పంచగ్రంథ అధ్యయనములో అంశాత్మక పద్ధతి యోగ్యమైనదిగా ఉంటుంది.

అంశాత్మక వ్యాఖ్యానము అను వ్యాఖ్యాన వ్యూహముతో పాటుగా, ఇవాంజెలికల్ క్రైస్తవులు పంచగ్రంథ అధ్యయనము కొరకు చారిత్రిక వ్యాఖ్యానమును కూడా ఉపయోగిస్తారు.

### చారిత్రిక

పంచగ్రంథములో ఉన్న వేదాంతశాస్త్ర అంశములు నిజమైనవని మాత్రమే ఇవాంజెలికల్ క్రైస్తవులు నమ్మరు. కాని, యేసు, ఆయన అపొస్తలులు మరియు ప్రవక్తల యొక్క ఉదాహరణలను అనుసరిస్తూ, పంచగ్రంథములో నమోదుచేయబడిన చరిత్ర కూడా నిజమైనది అని నమ్ముతారు. ఈ కారణము చేత, ఇవాంజెలికల్ క్రైస్తవులు మునుపటి కాలములో జరిగిన విషయములను కనుగొనుటకు మాధ్యమముగా పంచగ్రంథమును వ్యాఖ్యానించారు.

అంశాత్మక వ్యాఖ్యాన వ్యూహములు పంచగ్రంథమును మనలో ఆసక్తిని కలిగించు అంశములను ప్రతిబింబించు ఒక అద్దము వలె ఉపయోగిస్తాయని మనము ప్రస్తావించాము. కాని, చారిత్రిక విశ్లేషణ పంచగ్రంథమును చరిత్రలోనికి ఒక కిటికీగా పరిగణిస్తుంది. దాని వెనుక ఉన్న చరిత్రను విశదీకరించుటకు మనము మోషే వ్రాసిన గ్రంథములను ఉన్నవి ఉన్నట్లుగా చూస్తాము.

ఆదికాండము సృష్టి నుండి యోసేపు దినముల వరకు గల చరిత్రను తెలియజేస్తుంది. నిర్గమకాండము యోసేపు మరణము మొదలుకొని ఇశ్రాయేలు మోషేతో కలసి సీనాయి పర్వతము యొద్ద గుడారములను వేసుకొని నివసించుట వరకు జరిగిన చరిత్రను తెలియజేస్తుంది. సీనాయి పర్వతము యొద్ద ఉన్నప్పుడు మోషే పొందుకున్న కొన్ని నియామాలను మరియు ఆచారములను లేవీయకాండము విశదీకరిస్తుంది. నిర్గమము తరువాత మొదటి తరము మరియు రెండవ తరము

సీనాయి పర్వతము యొద్ద నుండి మోయాబు మైదానముల వరకు చేసిన ప్రయాణములను సంఖ్యాకాండము వివరిస్తుంది. ఇశ్రాయేలు ప్రజలు కనానులోనికి ప్రవేశించుటకు సిద్ధపడుచుండగా మోయాబు మైదానములలో మోషే వారికి ఇచ్చిన ఉపన్యాసములను ద్వితీయోపదేశకాండము వర్ణిస్తుంది. చారిత్రిక వ్యాఖ్యానములో, ఇవాంజెలికల్ క్రైస్తవులు ఈ స్పష్టమైన చారిత్రిక ధోరణికి ఉపయోగించారు.

చారిత్రిక వ్యాఖ్యానము ఎంత అమూల్యమైనదిగా ఉన్నప్పటికీ, పంచగ్రంథ అధ్యయనమునకు ఉపయోగించు ఈ పద్ధతిలో కూడా కొన్ని బలహీనతలు ఉన్నాయి. అంశాత్మక వ్యాఖ్యానము వలెనె, చారిత్రిక వ్యాఖ్యానము కూడా మోషేకు మరియు అతని వాస్తవిక శ్రోతలకు తక్కువ ప్రాముఖ్యతను ఇస్తుంది. బదులుగా, పంచగ్రంథము వ్రాయబడుటకు ముందు పలు కాలములలో దేవుడు చేసిన కార్యముల మీద విశేషమైన దృష్టిపెట్టబడింది. ఆదాము హవ్వలతో దేవుడు ఏమి చేశాడు? నోవహు కాలములో వచ్చిన జలప్రళయం యొక్క ప్రాముఖ్యత ఏమిటి? అబ్రాహాము దేవునితో ఎలా మాట్లాడాడు? ఇశ్రాయేలు సముద్రమును దాటినప్పుడు దేవుడు ఏమి సాధించాడు? ఇవి యోగ్యమైన అన్వేషణలే, కాని రచయితగా మోషే యొక్క ప్రాముఖ్యతను మరియు వాస్తవిక శ్రోతలుగా ఇశ్రాయేలు యొక్క ప్రాముఖ్యతను ఇవి తక్కువ చేస్తాయి.

స్పష్టముగా, పంచగ్రంథము యొక్క అంశాత్మక మరియు చారిత్రిక వ్యాఖ్యానము ద్వారా ఇవాంజెలికల్ క్రైస్తవులు ఎంతో లాభాన్ని పొందారు. కాని ఈ మధ్య దశాబ్దములలో, మూడవ ధోరణి మనుగడలోనికి వచ్చింది, దానిని మనము సాహిత్య వ్యాఖ్యానము అని పిలువవచ్చు.

## సాహిత్య

మనము ఇంతకు ముందు చూసినట్లు, అంశాత్మక విశ్లేషణ పంచగ్రంథమును మన కొరకు ప్రాముఖ్యమైన అంశములను ప్రతిబింబించు ఒక అద్దముగా పరిగణిస్తుంది. చారిత్రిక విశ్లేషణ పంచగ్రంథము వ్రాయబడక ముందు ఉన్న చారిత్రిక సన్నివేశములను చూచుటకు కిటికీగా పంచగ్రంథమును పరిగణిస్తుంది. భిన్నముగా, సాహిత్య విశ్లేషణ పంచగ్రంథమును దాని వాస్తవిక శ్రోతల మీద కొన్ని విధములుగా ప్రభావమును చూపుటకు రూపొందించబడిన ఒక చిత్రముగా, ఒక సాహిత్య కళా రూపముగా చూస్తుంది. ప్రాముఖ్యముగా, సాహిత్య వ్యాఖ్యానము ఈ ప్రశ్నను అడుగుతుంది: మోషే పంచగ్రంథమును వ్రాయుచుండగా తన వాస్తవిక ఇశ్రాయేలీయ శ్రోతల మీద ఏ విధంగా ప్రభావమును చూపాలని ఆశించాడు?

మోషే అనేక ఉద్దేశ్యములను కలిగియున్నాడని చెప్పుట సమంజసమే. కాని ఈ ఉద్దేశ్యములను సామన్య పదములలో వర్ణించుట ప్రయోజనకరముగా ఉంటుంది. కాబట్టి, మోషే యొక్క లక్ష్యమును ఈ విధంగా వర్ణించుదాము: దేవునిచే అభిషేకించబడిన ఇశ్రాయేలు నాయకునిగా,

> వాగ్దాన దేశమును స్వాధీనపరచుకొను మరియు దానిలో స్థిరపడు దైవిక పరిచర్యను నమ్మకముగా చేయునట్లు ఇశ్రాయేలును సిద్ధపరచుటకు మోషే పంచగ్రంథమును వ్రాశాడు.

కొన్ని అంశములను సంక్షేపముగా వివరించుటకు బదులుగా, లేక చారిత్రిక ఉద్దేశముల కొరకు కొన్ని సన్నివేశములతో వ్యవహరించుటకు బదులుగా, పంచగ్రంథములో వ్రాయబడియున్న ప్రతి చారిత్రిక నివేదిక ఈ లక్ష్యమును సాధించుటకు రూపొందించబడినది.

మోషే పంచగ్రంథమును వ్రాయుచున్నప్పుడు రెండు కాలముల మధ్య అతడు నిలబడ్డాడని సాహిత్య వ్యాఖ్యానము గుర్తిస్తుంది. ఒక వైపున, మనము "ఆ లోకము" అని పిలచు మునుపు జరిగిన సన్నివేశములను గూర్చి మోషే వ్రాశాడు. ఆదికాండములోని సన్నివేశములు మోషే దినమునకు చాలా కాలం క్రితం జరిగాయి. నిర్గమకాండము మరియు లేవీయకాండము ఐగుప్తు నుండి బయటకు వచ్చిన మొదటి తరమువారి కాలములో జరిగిన సన్నివేశముల మీద దృష్టిపెడతాయి. సంఖ్యాకాండము మరియు ద్వితీయోపదేశకాండము మొదటి తరము మరియు రెండవ తరము మధ్య జరిగిన సన్నివేశములను వివరిస్తాయి. మోషే పంచగ్రంథములోని ప్రతి పుస్తకమును వ్రాసినప్పుడు మునుపు జరిగిన ఈ సన్నివేశములన్ని అతని మనస్సులో ఉన్నాయి.

అయితే మరొక వైపు, మోషే "వారి లోకము," అనగా వాస్తవిక శ్రోతలు జీవించుచున్న దినములను గూర్చి కూడా వ్రాశాడు. "వారి లోకము"లోని ప్రజలు దేవుని సేవించునప్పుడు ఏ విధంగా ఆలోచన చెయ్యాలి, కార్యములు చెయ్యాలి, మరియు ఏ విధంగా భావించాలో తెలుపుటకు మోషే మునుపటి "ఆ లోకము"లో నుండి వ్రాశాడు. ఈ లక్ష్యమును సాధించుటకు, "వారి లోకము"నకు అనుసంధానపరచు విధముగా మోషే "ఆ లోకము"ను గూర్చి వ్రాశాడు.

మోషే మునుపటిని తన వాస్తవిక శ్రోతలతో మూడు ముఖ్యమైన విధాలుగా అనుసంధానం చేశాడు. తన శ్రోతలు ప్రస్తుతము ఎదుర్కొనుచున్న అనుభవాలకు నేపథ్యములను స్థాపించుటకు అతడు మునుపటి కథనములను ఇచ్చాడు. అనుకరించుటకు మరియు తిరస్కరించుటకు అతడు వారికి కొన్ని మాదిరులను ఇచ్చాడు. మరియు తన కథనములను అతడు తన శ్రోతల లోకమునకు ముందస్తు సూచనలుగా ఇచ్చాడు.

కొన్నిసార్లు, మోషే ఈ సంబంధములను చాలా స్పష్టముగా చూపాడు. ఉదాహరణకు, ఆది. 15:12-16లో, మోషే తన శ్రోతలకు ఐగుప్తు నుండి బయటకు నడిపిస్తానని దేవుడిచ్చిన వాగ్దానము యొక్క నేపథ్యమును గూర్చి చెప్పాడు. ఆ వాగ్దానము వారి దినములలో నెరవేర్చబడుతు ఉంది. ఆది. 2:24లో, ఆదాము హవ్వల వివాహము దేవుని యొక్క నమ్మకమైన ప్రజలకు ఒక మాదిరిగా ఉన్నదని మోషే వివరించాడు. మరియు ఆది. 25:23లో, యాకోబు ఏశావులు తమ తల్లి గర్భములో పోరాడుట తన దినములలో ఇశ్రాయేలు శ్రోతలు మరియు ఎదోమీయుల మధ్య జరిగిన సంఘర్షణకు ముందస్తు సూచనగా ఉన్నదని మోషే నివేదించాడు.

"ఆ లోకము" మరియు "వారి లోకము" మధ్య స్పష్టమైన సంబంధములు పంచగ్రంథములలో అక్కడక్కడ కనిపిస్తాయి. కాని చాలా వరకు ఈ సంబంధములు అస్పష్టముగా ఉన్నాయి. కాబట్టి, మునుపటి "ఆ లోకము"ను మరియు తన వాస్తవిక శ్రోతల యొక్క "వారి లోకము"ను మోషే ఎలా అనుసంధానపరిచాడో చూచుట సాహిత్య వ్యాఖ్యానము యొక్క ముఖ్యమైన పనులలో ఒకటైయున్నది.

ఒక వెయ్యి సంవత్సరముల పాటు, పంచగ్రంథము యొక్క అనువాదము సాహిత్య విశ్లేషణ కంటే అంశాత్మక మరియు చారిత్రిక వ్యూహముల మీద ఎక్కువ ఉద్ఘాటనను పెట్టింది. కాబట్టి, మోషే గ్రంథములను గూర్చిన మన పాఠములలో, మనము ఎక్కువ సమయమును సాహిత్య వ్యాఖ్యానమునకు

అంకితం చేద్దాము. తన శ్రోతల అనుభవముల యొక్క నేపథ్యములను, మాదిరులను మరియు ముందస్తు సూచనలను ఇచ్చుటకు మోషే తాను వ్రాసిన పుస్తకములలోని విషయములను ఏ విధంగా తీర్చిదిద్దాడో మనము విశదీకరిద్దాము. తన వాస్తవిక శ్రోతల కొరకు మోషే ఏమి ఉద్ఘాటించాడో, పుస్తకములలోని విషయములను వారి జీవితములకు ఎలా అనుసంధానపరిచాడో, మరియు ఆ దినములలో దేవుని నమ్మకముగా సేవించునట్లు తన వాస్తవిక ఇశ్రాయేలీయ శ్రోతలను మోషే ఎలా నడిపించాడో మనము చూద్దాము.

## ముగింపు

పంచగ్రంథమునకు మనము ఇచ్చిన ఈ పరిచయంలో, బైబిలులోని ఈ భాగము పట్ల ఆధునిక విమర్శనాత్మక పద్ధతులలోని కొన్ని ప్రాముఖ్యమైన లక్షణములను మనము పరీక్షించాము. విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తల యొక్క పూర్వభావిత్వములు పంచగ్రంథ గ్రంథకర్తృత్వము మరియు పలు రకముల వ్యాఖ్యానముల మీద కొన్ని అభిప్రాయములకు ఎలా దారితీశాయో చూశాము. మనము ఆధునిక ఇవాంజెలికల్ దృక్పథములను చూసి, ఆధునిక ఇవాంజెలికల్ క్రైస్తవుల యొక్క పూర్వభావిత్వములు గ్రంథకర్తృత్వము మరియు వ్యాఖ్యానము మీద భిన్నమైన అభిప్రాయములకు ఏ విధంగా దారితీశాయో చూశాము.

పంచగ్రంథ అధ్యయనమును మనము కొనసాగించుచుండగా, ఈ పరిచయ విషయములు మరలా మరలా ప్రత్యక్షమవుతాయి. ఇవి అలా ప్రత్యక్షమైనప్పుడు, బైబిలులోని ఈ పునాది భాగముతో వ్యవహరించుటకు మనము సన్నద్ధులమైయున్నాము. మనము ముందుకు కొనసాగుచుండగా, ఇలాంటి ప్రశ్నలను పరిగణించబోతున్నాము: మోషే పంచగ్రంథములోని ప్రతి పుస్తకమును ఎందుకు వ్రాశాడు? ఈ పుస్తకముల యొక్క వాస్తవిక ఉద్దేశ్యము ఏమిటి? మోషే యొక్క వాస్తవిక శ్రోతలకు పంచగ్రంథము ఇచ్చిన అంతర్భావములు ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు జవాబిచ్చుట ద్వారా, మోషే యొక్క వాస్తవిక అర్థము పట్ల కొన్ని ప్రాముఖ్యమైన ధోరణులను మనము కనుగొంటాము. మరియు మోషే దినములలో ఇశ్రాయేలు విశ్వాసమునకు ఆరంభ ప్రమాణముగా బైబిలులోని మొదటి ఐదు పుస్తకములు ఏ విధంగా వ్యవహరించినాయో మాత్రమే మనము చూడముగాని, నేడు మనము క్రీస్తును అనుసరించుచుండగా ఈ పుస్తకములు మన విశ్వాసమునకు ప్రమాణముగా ఏ విధంగా ఉపయోగపడగలవో కూడా మనము కనుగొంటాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.